

కరోనాపై అప్రమత్తం

ప్రతి అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్య పరీక్షలు

- మాస్కులు ధరించాలని, శానిటైజర్‌ను వినియోగించాలని అధికార యంత్రాంగం సూచన
- అది కొవిడ్ మరణం కాదని వాదన
- కార్పొరేట్ ఆస్పత్రికి నోటీసు?



విశాఖపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి): కరోనా మళ్లీ చాపకింద నీరులా వ్యాపిస్తోంది. ఆరు రోజుల క్రితం పిఠాపురం కాలనీలో ఓ మహిళకు కరోనా సోకింది. ఆమె కోలుకుంది. ఆ మరుసటి రోజే అదే కుటుంబంలో మరొక యువకుడికి అదే లక్షణాలు ఉండడంతో వైద్య పరీక్షలు చేయగా కొవిడ్ పాజిటివ్ అని తేలింది. దీంతో కేసుల సంఖ్య రెండుకు చేరింది. వీటిని జిల్లా యంత్రాంగం ధ్రువీకరించింది. కానీ హెచ్‌బీ కాలనీకి చెందిన ఓ వ్యక్తి(64) కరోనాతో ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందితే దానిని జిల్లా యంత్రాంగం అంగీకరించడం లేదు. ఆ వ్యక్తికి ప్రభుత్వం నిర్దేశించిన కేజీహెచ్‌లోని వీడీఆర్ఎల్ కేంద్రంలో ఆర్‌టీపీసీఆర్ చేయలేదు కాబట్టి అది కరోనా కిందకు రాదని చెబుతోంది. ఆ రోగికి బీపీ, షుగర్, న్యుమోనియాతో పాటు పార్కిన్‌సన్స్ వ్యాధి ఉందని, అందువల్లే మృతి చెందాడని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. కార్పొరేట్ ఆస్పత్రి వర్గాలు మాత్రం తాము కరోనా టెస్టును ప్రైవేటు లేబొరేటరీలో చేయించామని, అక్కడ పాజిటివ్ వచ్చిందని చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగానికి సమాచారం ఇవ్వకుండా కొవిడ్ మరణం అని ఎలా ధ్రువీకరిస్తారో వివరణ ఇవ్వాలంటూ ఆ ఆస్పత్రికి నోటీసు జారీ చేయాలని నిర్ణయించారు. కరోనా పట్ల ప్రజల్లో భయాందోళనను కలిగించడం తగదని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి. నిజంగానే ఆ రోగికి కరోనా లక్షణాలు ఉంటే శాంపిల్ తీసి కేజీహెచ్‌లోని ప్రభుత్వ లేబొరేటరీకి పంపించాల్సిన బాధ్యత ఆస్పత్రిపై ఉందని అంటున్నాయి.

ప్రతి అర్బన్ హెల్త్ సెంటర్‌లో పరీక్షలు

నగరంలో కరోనా కేసులు బయటపడిన నేపథ్యంలో ప్రతి ... మిగతా 6వ పేజీలో

నగరంలో కరోనా తొలి మరణం

- 64 ఏళ్ల వ్యక్తి ప్రైవేటు ఆస్పత్రిలో మృతి
- ఇప్పటి వరకు మూడు పాజిటివ్ కేసులు
- కొవిడితో మృతి చెందలేదు: డీఎంహెచ్‌వో

- వివరాలు మెయిన్‌లో...

నగరంలో మిలాన్

ముచ్చటగా మూడోసారి విశాఖ వేదిక

ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకు ఏర్పాట్లు

- ఫిబ్రవరి 14 నుంచి 24 వరకు నిర్వహణ
- 145 దేశాలకు ఆహ్వానం పంపిన నేవీ అధికారులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ నగరంలో ముచ్చటగా మూడోసారి 'మిలాన్'ను నిర్వహించనున్నారు. దీంతోపాటే ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్)కు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకేసారి రెండు ప్రతిష్ఠాత్మకమైన నేవీ కార్యక్రమాలను వచ్చే ఏడాది అంటే.. 2026లో ఫిబ్రవరి 14 నుంచి 24వ తేదీ వరకు పది రోజుల పాటు నిర్వహించనున్నారు. దీంతో విశాఖపట్నం విదేశీ అతిథులతో కళకళలాడనున్నది. మిత్ర దేశాల నౌకాదళాలతో కలిసి నిర్వహించే బహు పాక్షిక ... మిగతా 6వ పేజీలో



గురజాడ కళాక్షేత్రంలో జరిగిన 'థగ్ లైఫ్' ప్రీ రిలీజ్ వేడుకలో కమల్‌హాసన్ అభివాదం, మాట్లాడుతున్న హీరోయిన్ త్రిష, నటుడు శింబు

'మరో చరిత్ర'తో తెలుగు ప్రజలు నన్ను హీరోగా ఆదరించారు

- ఇప్పటికీ చాలామంది మా సొంతూరు విశాఖపట్నం అనుకుంటారు
- ప్రముఖ నటుడు కమల్‌హాసన్
- ఘనంగా థగ్ లైఫ్ ప్రీ రిలీజ్ వేడుక

- మెయిన్‌లో

రెవెన్యూ బదిలీలకు రంగం సిద్ధం

ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 68 మంది దరఖాస్తు

- ఏజెన్సీ నుంచి నగరానికి రావడానికి పలువురు ఎదురుచూపు
- నగరం నుంచి అల్లూరి జిల్లాకు వెళ్లడానికి ఎక్కువ మంది విముఖత
- సమావేశమైన మూడు జిల్లాల కలెక్టర్లు



విశాఖపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో రెవెన్యూ ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. జూన్ 2వ తేదీలోగా బదిలీలను చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో తహశీల్దార్ నుంచి అటెండర్ వరకు మొత్తం 68 మంది ఉద్యోగులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిని పరిశీలించి విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తుది జాబితాను ఖరారు చేయాలి. ఈ నేపథ్యంలో గురువారం కలెక్టర్ అధ్యక్షతన విశాఖ నగరంలో జరిగిన సమావేశంలో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు విజయకృష్ణన్, దినేశ్ కుమార్‌లు పాల్గొన్నారు. మూడు జిల్లాల పరిధిలో ప్రస్తుతం ఉన్న ఖాళీలు, ఐదేళ్లకు మించి ఒకేచోట పనిచేసిన డీటీలు/సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు ఎంతమంది ఉన్నారు..? అనేది జాబితా రూపొందించి వారికి స్థానచలనం కల్పించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ మేరకు నివేదికలను సిద్ధం చేస్తున్నారు. గత ఏడాది బదిలీల్లో ఏజెన్సీ నుంచి విశాఖ/అనకాపల్లి జిల్లాలకు బదిలీ అయిన తహశీల్దార్లలో ఇద్దరు ముగ్గురిని ఇప్పటివరకు రిలీవ్ చేయలేదు. వారి స్థానంలో విశాఖ, అనకాపల్లి నుంచి ఎవరూ ఏజెన్సీకి వెళ్లకపోవడంతో అక్కడి కలెక్టర్ పాడేరు డివిజన్‌లో పనిచేసే వారిని రిలీవ్ చేయలేదు.

జిల్లాల విభజన సమయంలో జూనియర్లను అల్లూరి జిల్లాకు ... మిగతా 6వ పేజీలో

13 మంది ప్రధానోపాధ్యాయులకు బదిలీ

8 మంది స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతి

విశాఖపట్నం మే 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు బదిలీలు నిర్వహించారు. మొత్తం 13 మంది హెచ్‌ఎంలకు వెబ్ ఆప్షన్ల ద్వారా బదిలీ చేశారు. ఇంకా ఖాళీగా ఉన్న హెచ్‌ఎం పోస్టుల భర్తీని గురువారం విశాఖ నగరంలోని సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో ఆర్జేడీ విజయభాస్కర్ ఆధ్వర్యంలో చేపట్టారు. 8 మంది స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించారు. పదోన్నతి పొందిన వీరిని ఆర్జేడీ అభినందించారు.

ఉక్కు యాజమాన్యం తీరుపై కాంట్రాక్టు కార్మికుల కన్నెర్ర

- దశాబ్దాల నుంచి పనిచేస్తుంటే ఎలా తీసేస్తారని ఆందోళన
- గంగవరం పోర్టులా నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్



విశాఖపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కర్మాగార యాజమాన్యం తీరుపై కాంట్రాక్టు కార్మికులు తీవ్రంగా మండిపడుతున్నారు. సుమారు రెండు దశాబ్దాల నుంచి తామంతా ప్లాంటులో వివిధ పనులు చేస్తున్నామని, ఇప్పుడు అర్ధంతరంగా గేట్ పాసులు ఆపేసి, తీసేశామంటే ఎలా అని వారు ప్రశ్నిస్తున్నారు. పూర్తి ఆరోగ్యంతో ఉండి, చెప్పిన పనంతా చేస్తుంటే తమను పనుల నుంచి ఎలా తొలగిస్తారని వారు వాదిస్తున్నారు. యాజమాన్యానికి తాము ఆర్థిక భారంగా అనిపిస్తే ఉద్యోగులకు వీఆర్ఎస్ ద్వారా ఎలా పరిహారం ఇచ్చారో.. అదేవిధంగా తమకూ పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గత ఏడాది ఏప్రిల్‌లో గంగవరం (అదానీ) పోర్టులో నిర్వాసిత కార్మికులు తక్కువ వేతనాలు ఇస్తున్నారని సుమారు 45 రోజులపాటు సమ్మె చేశారని, వారు తమకు అవసరం లేదని యాజమాన్యం చెబితే అధికారులతో చర్చలు జరిగి ఒక్కో కార్మికుడికి రూ.25 లక్షల నష్టపరిహారం ఇప్పించారని, తమకూ ఆ విధంగానే పరిహారం ఇప్పించాలని ... మిగతా 6వ పేజీలో

డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా కోన తాతారావు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- వచ్చే నెల 27 నుంచి చైర్‌పర్సన్ ఇన్‌చార్జి హోదా



కోన తాతారావు

విశాఖపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిగా కోన తాతారావు నియమితులయ్యారు. ఈ మేరకు ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. కోన తాతారావు పర్సన్ ఇన్‌చార్జిగా వచ్చే నెల 26వ తేదీ వరకు ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వం గత ఏడాది డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్‌ను నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు వచ్చే నెల 26వ తేదీ వరకు అమల్లో వుంటాయి. అందువల్ల జేసీ స్థానంలో కోన తాతారావును నియమించారు. వచ్చే నెల 27వ తేదీ నుంచి ఆరు నెలల కాలానికి మరో జీవో తరువాత జారీచేస్తారు. సాధారణంగా డీసీసీబీ పాలకవర్గాన్ని అనధికార వ్యక్తులతో భర్తీ చేసేటప్పుడు చైర్‌పర్సన్ ఇన్‌చార్జి, మరో ఆరుగురు పర్సన్ ఇన్‌చార్జిలుగా (సభ్యులు) నియమించాలి. అయితే ప్రభుత్వం ఒక్కరినే నియమించడంతో కోన తాతారావును పర్సన్ ఇన్‌చార్జిగా పరిగణిస్తారు. వచ్చే నెలలో జారీచేయనున్న జీవోలో మొత్తం ఏడుగురితో పాలకమండలిని నియమించిన తరువాత కోన తాతారావును చైర్‌పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు.

యాచకులకు అడ్డాగా బస్టాపులు!

బిచ్చగాళ్లు ఆక్రమించుకోవడంతో అటువైపు వెళ్లని ప్రయాణికులు

- రోడ్లపై నిల్చునే బస్సుల కోసం ఎదురుచూపులు
- నిరాశ్రయులు, యాచకులను ఆశ్రయ కేంద్రాల్లో చేర్చడంపై దృష్టిసారించని పోలీస్, జీవీఎంసీ సిబ్బంది



తాటిచెట్లపాలెం బస్టాపులో యాచకుల కుటుంబం

విశాఖపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అనేక బస్టాపులు యాచకులకు అడ్డాగా మారుతున్నాయి. బస్సుల్లో ప్రయాణించేవారు వేచివుండేందుకు వీలుగా నిర్మించిన బస్టాపుల్లో యాచకులు, నిరాశ్రయులు, మతిస్థిమితం లేనివారు తిష్ట వేయడంతోపాటు అక్కడే ఆవాసాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో ప్రయాణికులు బస్టాపుల వద్దకు వెళ్లడానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదు. బస్టాపునకు కొద్ది దూరంలో రోడ్డుపై నిల్చునే బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.



కేజీహెచ్ బస్టాపులో...

స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందుతున్న నగరంలో బస్టాపులను కూడా స్మార్ట్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో జీవీఎంసీ ఏడాది కిందట సుమారు రూ.2.8 కోట్లతో 30 బస్టాపులను స్మార్ట్‌గా అభివృద్ధి చేసింది. మొదట్లో చూడడానికి ఎంతో ఆకర్షణీయంగా ఇవి కనిపించడంతో అందరూ జీవీఎంసీ చేసిన పనిని అభినందించారు. అయితే వీటి నిర్వహణపై జీవీఎంసీ, ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో కొన్ని బస్టాపుల్లోని పరికరాలు చోరీకి గురై అందవిహీనంగా తయారయ్యాయి. మరికొన్ని బస్టాపులను యాచకులు, నిరాశ్రయులు, మతిస్థిమితం లేనివారు ఆవాసాలుగా మార్చుకున్నారు. నగరంలో ఎలాంటి ఆసరా లేకుండా రోడ్లపై తిరిగే నిరాశ్రయులు, యాచకులు రహదారుల పక్కన నిద్రపోకుండా ఏదైనా సురక్షిత ప్రదేశంలో పడుకునేందుకు వీలుగా జీవీఎంసీ ఆధ్వర్యంలో ఆశ్రయ కేంద్రాలను నడుపుతున్నారు. నగరంలో యాచకులు, ఎలాంటి ఆసరా లేకుండా రోడ్లపై తిరిగే ఒంటరి వ్యక్తులను చీకటిపడిన తరువాత రహదారులపై ఉండకుండా పోలీసులు, జీవీఎంసీ యూసీడీ సిబ్బంది సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టి కనిపించిన వారిని సమీపంలోని ఆశ్రయ కేంద్రానికి తరలించాలి. అటువంటి ... మిగతా 6వ పేజీలో

సక్రమంగా సరకులు పంపిణీ చేయండి

రేషన్ డీలర్లకు జిల్లా పౌరసరఫరాల అధికారి భాస్కర్ సూచన

- ప్రతినెలా 1 నుంచి 15 తేదీ వరకు పంపిణీ
- ఉదయం 8 నుంచి 12, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 వరకు డిపోలను తెరవాలి
- ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పౌరసరఫరాల అధికారి భాస్కర్

విశాఖపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి): రేషన్ డిపోల ద్వారా జూన్ ఒకటో తేదీ నుంచి కార్డుదారులకు సక్రమంగా సరకులు పంపిణీ చేయాలని డీలర్లకు జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్ సూచించారు. గురువారం వన్‌టౌన్‌లోని వాసవి కల్యాణ మండపంలో నగర రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాలుగున్నరేళ్ల తరువాత తిరిగి రేషన్ డిపోల ద్వారా సరకుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, దీంతో డీలర్లకు స్వయంగా సరకులు పంపిణీ చేసే అవకాశం వచ్చిందన్నారు. దీనిని అందరూ సద్వినియోగం చేసుకుని కార్డుదారులతో మంచి సంబంధాలను కొనసాగించడంతోపాటు కచ్చితమైన తూకంతో సరకులు ఇవ్వాలన్నారు. ముఖ్యంగా సమయపాలన పాటించాలని, ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మళ్లీ సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు డిపోలను తెరిచి ఉంచాలన్నారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇళ్ల వద్దే సరకులు పంపిణీ చేయాలని, డిపో పరిధిలో గల వృద్ధులకు సంబంధించి వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సరకుల పంపిణీలో ఎవరూ అక్రమాలకు పాల్పడకూడదని, ఒకవేళ ఎవరైనా డీలర్లు తప్పులు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్కిల్-2 ఏఎస్‌వో కల్యాణి మాట్లాడుతూ డిపోల్లో ఒరిజినల్ డీలర్లే కూర్చుని సరకులు పంపిణీ చేయాలన్నారు. బినామీలు డిపోలను నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో తూనికలు, కొలతల అధికారి రాధాకృష్ణ, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, సర్కిల్1, 3 ఏఎస్‌వోలు మురళి, కృష్ణ, డీలర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు చిట్టిరాజు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'గాలి'కి పట్టిన గతే జగన్‌కు పడుతుంది

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



మహానాడు వేదికపై ప్రసంగిస్తున్న పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి): ఒక్క చాన్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టి 2019 నుంచి 2024 వరకు రాష్ట్రాన్ని దోచుకున్న మాజీ సీఎం జగన్‌కు మైనింగ్‌లో అక్రమాలకు పాల్పడిన గాలి జనార్దనరెడ్డికి పట్టిన గతే పడుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. కడపలో జరిగిన టీడీపీ మహానాడు చివర రోజైన గురువారం ఆయన వేదికపై మాట్లాడుతూ అధికారాన్ని అడ్డం పెట్టుకుని గతంలో చేసిన తప్పులను మాఫీ చేయడానికి జగన్ ప్రయత్నించారన్నారు. అయితే న్యాయం జరగడంలో జాప్యం జరగవచ్చు గానీ దోషులకు శిక్ష పడడం ఖాయమని పల్లా పేర్కొన్నారు.

ఏషియన్ అథ్లెటిక్స్ మీట్‌లో

ఎర్రాజి జ్యోతి సరికొత్త రికార్డు

- 100 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణం కైవసం



విశాఖపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన ఒలింపియన్ ఎర్రాజి జ్యోతి సరికొత్త రికార్డు నెలకొల్పింది. కొరియాలో జరుగుతున్న ఈ టోర్నీలో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి స్వర్ణపతకాన్ని కైవసం చేసుకుంది. అంతేకాకుండా 100 మీటర్ల రేస్‌ను మెరుపు వేగంతో 12.96 సెకన్లలో పూర్తి చేసి సరికొత్త ఆసియా రికార్డును నెలకొల్పింది. ఏషియన్ గేమ్స్, ఏషియన్ చాంపియన్‌షిప్ టోర్నీల్లో పతకాలు సాధించడమే కాకుండా ఒలింపిక్స్‌లో పాల్గొన్న తొలి విశాఖ అథ్లెట్ జ్యోతి కావడం విశేషం. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ సంఘం ప్రతినిధులు డి.నాగేశ్వరరావు, ఎం.నారాయణరావు, ఇతర ప్రతినిధులు ఆమెను అభినందించారు.



అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, మే 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలను బయటకు తీసి భక్తులతో తాకించిన తరువాత బేడా మండపంలో ప్రదక్షిణ జరిపారు. ఉభయ దాతల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు స్వర్ణ పుష్పాలతో పూజలు చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్యకల్యాణం నిర్వహించారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, మే 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని చినముషిడివాడ ప్రాంతానికి చెందిన ఎస్. నరసింగరావు, వరలక్ష్మీ దంపతులు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,00,116లను ప్రజా సంబంధాల విభాగం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు గురువారం వారు నగదు రూపంలో అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి, శేష వస్త్రంతో సత్కరించారు.

1న సత్తెమ్మ తల్లి పండగ

సింహాచలం, మే 29 (ఆంధ్రజ్యోతి) : అప్పన్నస్వామి సోదరి, అడివివరం, సింహాచలం, శ్రీనివాసనగర్ తదితర ఏడు గ్రామాల సరిహద్దు దేవత సత్తెమ్మతల్లి వార్షిక పండగ వచ్చేనెల 1న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. పండగ పురస్కరించుకుని ఆలయాన్ని పలు పుష్పమాలికలు, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్ది, భక్తులకు ఉదయం నుంచి రాత్రి వరకు దర్శనాలు కల్పిస్తామని చెప్పారు.

ఘనంగా పద్మ సాయి ఆలయ వార్షికోత్సవం



సాయినాథుడికి కలశాలతో అభిషేకం

కొమ్మాది, మే 29 (ఆంధ్రజ్యోతి) : పీఎం పాలెం ఆఖరి బస్టాప్ వద్ద ఉన్న పద్మసాయి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఉదయం 1008 కలశాలతో సాయినాథుడికి భక్తులు సుగంధ ద్రవ్యాలు కలిపిన జలాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పాలాభిషేకం జరిపి, హోమం చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, కార్యదర్శి రాంబాబు, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సినిమా థియేటర్లు తనిఖీ

తగరపువలస, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఆర్డీఓ సంగీత్ మాథుర్ తగరపువలస, చిట్టివలస ప్రాంతాల్లోని సినిమా థియేటర్లను గురువారం తనిఖీ చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న మూడు థియేటర్లలలో కనీస సదుపాయాలు, టిక్కెట్ల అమ్మకాల కౌంటర్లను పరిశీలించారు.థియేటర్ల లోపల సీటింగ్ వివరాలు, తినుబండారాల ధరల పట్టికను కూడా చేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదాల నాణ్యతలో రాజీపడొద్దు : ఈఓ

సింహాచలం, మే 29 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామి ప్రసాదాల తయారీ నాణ్యతలో రాజీపడొద్దని ఈఓ వేంద్ర త్రినాథరావు ఆదేశించారు. గురువారం ఆయన ప్రసాదాల విక్రయ కేంద్రాన్ని పరిశీలించారు. రోజువారీ విక్రయాలు, తయారీ సంఖ్య, ఓపెనింగ్, క్లోజింగ్ స్టాక్‌ల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతపై స్వయంగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు పర్యవేక్షణాధికారి ప్రసాద్, డీఈఈ రామరాజు (హరి) ఉన్నారు.

సంగీతంతో మానసిక ప్రశాంతత

సింహాచలం, మే 29 (ఆంధ్రజ్యోతి) : సంగీతం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎన్ఎస్‌టీఎల్ విశ్రాంత అధికారి పి. కనికిరెడ్డి అన్నారు. అడివివరం శాఖా గ్రంథాలయాధికారి నరసింహం ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం ఆయన మాట్లాడారు. సంగీతం మక్కువతో నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత శిక్షకులు బ్రహ్మాజీ, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మూర్తి, కార్మిక నేత సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



భీమిలిలోని యోగా చైతన్య సంస్థలో శిక్షణ



పద్మనాభంలో యోగా శిక్షణలో పాల్గొన్న సచివాలయ ఉద్యోగులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

భీమునిపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కృష్ణాకాలనీ యోగా చైతన్య సంస్థలో యోగాంధ్రలో భాగంగా సచివాలయాల ఉద్యోగులకు గురువారం శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 28 నుంచి జూన్ 3వ తేదీ వరకూ ఈ తరగతులు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న సచివాలయాల నుంచి ప్రతిరోజూ 9 మంది చొప్పున శిక్షణకు హాజరవుతారు. శిక్షణ పొందిన తర్వాత ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సాధారణ పౌరులకు వారు శిక్షణ ఇస్తారు. కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ వెంకటరమణ, డి. అప్పలనాయుడు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ యోగాంధ్రలో భాగంగా శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ మాట్లాడుతూ యోగా కేవలం వ్యాయామ విధానం కాదని, ఒక సంపూర్ణ జీవన శైలి అని చెప్పారు. యోగా సాధన వల్ల శరీరానికి ఆరోగ్యం, మనసుకు ప్రశాంతత లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలాల్లో ఉద్యోగులకు శిక్షణ

కొమ్మాది : యోగాతోనే ఆరోగ్యాంధ్ర సాధ్యమని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గొట్టేటి రవి అన్నారు. ఆ పాఠశాలలో యోగా శిక్షకురాలు సునీత ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. అనంతరం యోగా ఇతివృత్తంపై చిత్రలేఖనం, లఘు నాటిక, కవితలు వంటి పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పిడి నాగమణి, పీకేఎం లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆనందపురం : మండల పరిషత్ సమావేశ మందిరంలో యోగా శిక్షణ నిర్వహించారు. శిక్షణలో అనేక మంది ఉద్యోగులు, పాల్గొని యోగాసనాలు వేశారు. యోగా గురువు నాగరాజు నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది.

పద్మనాభం : మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షకులకు శిక్షణ ఇచ్చారు. 16 సచివాలయాల నుంచి 144 మంది శిక్షకులు హాజరయ్యారు. శిక్షణ పొందిన వారు 9600 మందికి శిక్షణ ఇవ్వనున్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



ధాన్యపు గింజలను చూస్తున్న కమాండింగ్ ఆఫీసర్ నీరజ్‌కుమార్

సాగర్‌నగర్/ఎండాడ, మే 29 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎన్‌సీసీ 13వ బెటాలియన్ ఎల్‌టీకల్నల్ కమాండింగ్ ఆఫీసర్ నీరజ్‌కుమార్ అన్నారు. రుషికొండ గాయత్రీ విద్యా పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతున్న ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం గ్రీన్ క్లైమేట్ టీమ్, జీవీఎంసీ సంయుక్తంగా హరిత విశాఖ సాధన అన్న అంశంపై సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖను హరిత నగరంగా తీర్చిదిద్దడానికి ఎన్‌సీసీ పూర్తి స్థాయిలో కృషి చేస్తోందన్నారు. జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేశ్‌కుమార్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్యం మెరుగు కోసం తాము చేస్తున్న కృషిని వివరించారు. కాలువల్లో చెత్త వేయడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సస్టైనబుల్ రిజిలియన్స్ యూనిట్ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ స్వప్న, గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, ఎస్ఆర్‌యూ జీవీఎంసీ ప్రాజెక్ట్ ఇంజనీర్ దాట్ల వివేక్ వర్మ, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్ణిం, సుబేదార్ మేజర్ శ్రీనివాస్, సుబేదార్ సుహాన్‌సింగ్, సునీల్‌సింగ్, రవీంద్రసింగ్, తదితరులు పాల్గొన్నారు.

గొల్లల తాళ్లవలస యువకుల నిజాయతీ

దొరికిన నగదు బాధితుడికి అప్పగింత



బాధిత కుటుంబీకులకు నగదు అందిస్తున్న యువకులు

భీమునిపట్నం (రూరల్), మే 29 (ఆంధ్రజ్యోతి) : ఎవరైనా వేలాది రూపాయలతో నగదు ఉన్న బ్యాగు దొరికితే ఎవరికీ తెలియకుండా తమ సొంతానికి వాడుకుంటారు. కానీ మండలంలోని గొల్లల తాళ్లవలస గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు దొరికిన నగదును బాధితుడి చిరునామా తెలుసుకుని, పెద్దల సమక్షంలో అందించి తమ నిజాయతీ చాటుకున్నారు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం అక్కవరం గ్రామానికి చెందిన గారి పైడిరాజు బుధవారం ఆనందపురం మండలం గారిపేటకు బైక్‌పై వెళుతుండగా తాళ్లవలస వద్ద రూ. 60 వేలు నగదు, ప్రాంసరీ నోటు ఉన్న బ్యాగు కింద పడిపోయింది. అతను చూసుకోకుండా వెళిపోయారు. అదే రహదారిలో బైక్‌పై వస్తున్న గొల్లల తాళ్లవలస గ్రామానికి చెందిన గొలగాని గోపాలకృష్ణ, నల్ల గోవింద, కొంగరాని సంతోశ్ బ్యాగును చూశారు. అందులో నగదు, ప్రాంసరీ నోటు ఉండడంతో చిరునామా ఆధారంగా అదే రోజు రాత్రి గారిపేటలో పైడిరాజు ఇంటికి చేరుకుని, బ్యాగును అందించారు. యువకుల నిజాయతీని గ్రామస్తులు అభినందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ, మే 29 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ వుడాకాలనీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పోర్టు కాలనీ, ఎన్ జీఓ కాలనీ, సుద్దగెడ్డ ఏరియా, వాంబే కాలనీ, పోర్టు కాలనీ, శ్రీనివాసానగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

భీమునిపట్నం (రూరల్) : మండలంలోని తాళ్లవలస సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిపివేయనున్నారు. తాళ్లవలస, గొల్లల తాళ్లవలస, ఏతపేట, కొంగరాని కల్లాలు, తిరుమల రేడ్డు, చిన్నిపేట, వలందపేట, ఒసుంపేటకు సరఫరా ఉండదని అధికారులు చెప్పారు.

వేసవి దుక్కులతో భూమి సారవంతం : ఏఓ

పద్మనాభం రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : వేసవి దుక్కుల వల్ల భూమి సారవంతం అవుతుందని ఏఓ ఎంవీ చలం అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తొలకరి వర్షాలకు దుక్కులు చేసుకోవడం వల్ల భూమి సారవంతమై కలుపు మొక్కలు, చీడ పీడలను నివారించవచ్చన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు లోతుగా, ఏటవాలుగా దుక్కి దున్నుకోవడం వల్ల భూమి గుల్లగా మారుతుందని చెప్పారు. దీనివల్ల భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరగడమే కాకుండా తేమలో జీవించే సూక్ష్మ జీవులు, వానపాముల సంతతి వృద్ధి చెందుతుందన్నారు. అలాగే దుక్కులు లోతుగా దున్నితే భూమిలో ఉండే పురుగులు వాటి గుడ్లు పంట నాశకాలు, ఎండ వేడికి నశిస్తాయన్నారు.

1న పైడితల్లమ్మ పండగ నిర్వహణపై సభ

సింహాచలం, మే 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సోదరి, అడివివరం తదితర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పైడితల్లెమ్మ వార్షిక పండుగ నిర్వాహణ విషయమై చర్చించేందుకు జూన్ 1న గ్రామసభ ఏర్పాటు చేయనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామసభ వరాహ పుష్కరిణికి వెళ్లే మార్గంలోని దేవస్థానానికి చెందిన నృసింహ సదన్‌లో ఆ రోజు ఉదయం 11.00 గంటలకు జరుగుతుంద న్నారు.

చిట్టివలస హైస్కూల్ హెచ్‌ఎంగా ఆదినారాయణ

తగరపువలస, మే 29 (ఆంధ్రజ్యోతి) : గ్రేడ్ టు హెచ్‌ఎంల బదిలీల కౌన్సెలింగ్‌లో చిట్టివలస హైస్కూల్ హెచ్‌ఎంగా దొడ్డి ఆదినారాయణ నియమిలయ్యారు. ఇప్పటివరకు ఆయన మాడుగుల మండలం గాదిరాయిలో పని చేశారు. అలాగే మజ్జిపేట హెచ్‌ఎం ఉషారాణి ఎండాడ ఉన్నత పాఠశాలకు బదిలీ కాగా ఆమె స్థానంలో మునగపాక మండలం గణపర్తి నుంచి ఎం. జయలక్ష్మి వచ్చారు.

విద్యార్థులకు సేవాభావం ఉండాలి



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో పాఠశాల హెచ్‌ఎం రవి

కొమ్మాది, మే 29 (ఆంధ్రజ్యోతి) : స్కౌట్, గైడ్స్ విద్యార్థులంటే సమాజంలో విలువల పరిరక్షణ సారథులు అని, సేవా భావం ఉన్నవారని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గొట్టేటి రవి అన్నారు. గురువారం పాఠశాలలో శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో శిక్షణ పొంది రాజ్యపురస్కార్ సాధించిన విద్యార్థులు ఉన్నత స్థాయి విద్యాభ్యాసంలో, ఉద్యోగ సాధనలో ప్రాధాన్యత పొందుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ జిల్లా కార్యదర్శి డి. వేణుగోపాల్, స్కౌట్స్ జిల్లా కమిషనర్ ఆర్. మధుసూదనరావు, సహాయ కమిషనర్ అహ్మద్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

భీమునిపట్నం (రూరల్), మే 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శనివారం పింఛన్లు పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఏడు జోన్ల పరిధిలోనూ, భీమిలి. ఆనందపురం. పద్మనాభం మండలాల పరిధిలో 1,59,085 పింఛన్లను ఒక రోజు ముందుగా అందించనున్నారు. ఈమేరకు పింఛన్ల మొత్తం రూ 69,64,25,000 నగదును బ్యాంకుల నుంచి డ్రా చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

కరోనాపై అప్రమత్తం

... 5వ పేజీ తరువాయి

అర్బన్ సెంటర్‌లో కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. తగ్గని జ్వరం, జలుబుతో వచ్చి కరోనా లక్షణాలు కనిపిస్తే.. అటువంటి వారికి ఈ ఆర్‌టీపీసీఆర్ కిట్ ద్వారా పరీక్ష చేస్తున్నారు. వాటిని కేజీహెచ్‌లోని వీఆర్‌డీఎల్ కేంద్రానికి పంపుతున్నారు. ఇప్పటివరకు రెండు కేసులు తప్ప మళ్లీ ఇప్పటివరకు ఎటువంటి పాజిటివ్ కేసు రాలేదని వైద్య వర్గాలు చెబుతున్నాయి. ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలని అధికారులు చెబుతున్నారు.

వైద్యుల సూచన మేరకే మందులు

నగరంలో నెల రోజుల నుంచి అత్యధికులు జలుబు, జ్వరం, దగ్గులతో బాధపడుతున్నారు. ఇవి ఈ సీజన్‌లో వచ్చే జ్వరాలేనని చాలామంది సర్ది చెప్పుకుంటున్నారు. అయితే ఇవి కుటుంబంలో ఒకరికి వస్తే ఆ తరువాత మిగిలిన వారికీ వస్తున్నాయి. ఒకరి తరువాత ఒకరు చికిత్స తీసుకోవాల్సి వస్తోంది. ఈ జ్వరాలకు సొంత వైద్యం తీసుకోకుండా, మందుల షాపుల్లో ఇచ్చిన మాత్రలు వేసుకోకుండా డాక్టర్‌ను సంప్రతించి, వారి సూచనల మేరకు చికిత్స తీసుకోవాలని సీనియర్ వైద్యుడు, కేజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ సోమయాజులు సూచించారు.

సంపద తయారీ శిక్షణ కేంద్రంగా రేఖవానిపాలెం

భీమునిపట్నం (రూరల్), మే 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేఖవానిపాలెం పంచాయతీని చెత్త నుంచి సంపద తయారీ శిక్షణ కేంద్రంగా పంచాయతీరాజ్ కమిషనర్ ఎంపిక చేశారని జిల్లా పంచాయతీ అధికారి ఎం. శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన అధికారులతో కలిసి గ్రామంలోని సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. తడి, పొడి చెత్తను ఏవిధంగా వేరు చేయాలో వివరించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని పారిశుధ్య కార్మికులు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ అధికారులు ఈ కేంద్రానికి వచ్చి దశల వారీగా శిక్షణ పొందుతారని చెప్పారు. అలాగే పంచాయతీలో నిరుపయోగంగా ఉన్న చెత్తను ఉపయోగకరంగా చేసే విధానాలను, దాని ద్వారా పంచాయతీకి ఆదాయం లభించే మార్గాలను శిక్షణలో వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్. శ్రీనివాసరావు, స్థానిక నాయకులు వై. ఆనందకుమార్, మూలకద్దు సర్పంచ్ రెడ్డి, రమేశ్ నాయుడు, కార్యదర్శులు ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గ్రామంలో ప్రదర్శన ర్యాలీ చేస్తున్న పంచాయతీరాజ్ శాఖాధికారులు

రుషికొండ బీచ్‌లో వ్యర్థాల తొలగింపు



ఎక్స్‌కవేటర్‌తో దుస్తుల వ్యర్థాలను తొలగింపు

విశాఖపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలు వాడి పారేసిన దుస్తులన్నీ గెడ్డల ద్వారా సముద్రంలో కలిసి రుషికొండ బీచ్‌కే చేరుతున్నాయి. ఇటు ఫిషింగ్ హార్బర్ నుంచి అటు భీమిలి వరకు అనేక బీచ్‌లు ఉన్నా ఏ తీరానికి కూడా పాత దుస్తులు కొట్టుకురావడం లేదు. కేవలం రుషికొండ తీరానికి మాత్రమే రోజూ టన్నుల కొద్దీ వస్తున్నాయి. ఉదయం పూట ఒడ్డు వరకు సముద్రపు కెరటాలు వస్తున్నాయి. అప్పుడు ఎలాంటి ఇబ్బంది ఉండడం లేదు. మధ్యాహ్నం రెండు గంటలు దాటిన తరువాత సముద్రం పోటు తగ్గి నీరంతా లోపలికి వెళ్లిపోతోంది. అప్పుడు ఈ దుస్తులన్నీ ఇసుకలో కూరుకుపోయి ఉండిపోతున్నాయి. ఇక్కడ ఎక్కడైతే బోటు షికారుకు అనువైన ప్రాంతంగా ఎంపిక చేసి పర్యాటకుల కోసం బోట్లు నడుపుతున్నారో అక్కడికే ఈ దుస్తులన్నీ కొట్టుకువస్తున్నాయి. గత వారం రోజులుగా ఇదే జరుగుతోంది. రోజూ జీవీఎంసీ సిబ్బంది సుమారు టన్నుల వరకు వీటిని తొలగించి లారీల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. గురువారం పాత దుస్తులు పెద్ద ఎత్తున తీరమంతా పరుచుకుని ఉండడంతో సిబ్బందితో సాధ్యం కాదని ఎక్స్‌కవేటర్‌ను తెప్పించి తొలగించారు. సుమారు నాలుగు టన్నుల దుస్తులను తొలగించినట్టు బీచ్ నిర్వాహకులు తెలిపారు.

జిల్లా ఖజానా కార్యాలయంలో కూలిన ఇనుప మెట్లు



కూలిన ఇనుప మెట్లు (ఇన్‌సెట్లో) గాయపడిన అటెండర్

విశాఖపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఖజానా కార్యాలయంలో ఇనుప మెట్లు కూలిపోయాయి. భవనంలో కింది అంతస్తు నుంచి మొదటి అంతస్తుకు వెళ్లడానికి మెట్ల మార్గం వినియోగిస్తారు. గురువారం మధ్యాహ్నం అటెండరు ప్రసాద్ పై అంతస్తుకి వెళుతుండగా ఒక్కసారిగా మెట్ల మార్గం కుప్ప కూలిపోయింది. దీంతో అతని తలకు దెబ్బతగలడంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా ఖజానా కార్యాలయం భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పాటు మెట్ల మార్గం కూడా బాగా పాడైంది. మెట్ల మార్గం మూసివేయకుండా విడిచిపెట్టడంతో ఈ సంఘటన జరిగిందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు.

రెవెన్యూ బదిలీలకు రంగం సిద్ధం

... 5వ పేజీ తరువాయి

పంపారు. ఆ తరువాత పదోన్నతులు రావడంతో కొందరు జూనియర్లు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సీనియర్ అసిస్టెంట్ల నుంచి డీటీలుగా, డీటీల నుంచి తహశీల్దార్లుగా పదోన్నతులు పొందారు. విశాఖలో పనిచేసేవారు ఎక్కువ మంది ఇక్కడ నుంచి అల్లూరి జిల్లాకు వెళ్లడానికి ఇష్టపడడం లేదనే వాదన వినిపిస్తోంది. దీంతో చాలామంది ఉద్యోగులు ఏజెన్సీలోనే పనిచేస్తున్నారు. వీరిలో 50 ఏళ్లు పైబడినవారు, పలు రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు ఉన్నారని వారంతా వాపోతున్నారు. 60 ఏళ్లు పైబడిన తహశీల్దార్ ఒకరు తనను మైదానంలోకి బదిలీ చేయాలని ఏడాదిగా కోరుతున్నారు. ఇందుకు అనుగుణంగా ఏజెన్సీలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు ఇటీవల విశాఖ కలెక్టర్‌ను కలిసి తమను మైదానంలోకి బదిలీ చేయాలని వినతిపత్రం అందజేశారు. 50 ఏళ్లు వయసు దాటిన ఉద్యోగులను ఏజెన్సీకి బదిలీ చేయరాదని, ఒకవేళ చేసినా రెండేళ్ల తరువాత తిరిగి మైదానానికి పంపాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కాగా నిబంధనల మేరకు బదిలీలు చేసి.. ఏజెన్సీలో పనిచేసిన వారిని మైదానానికి పంపించకపోతే కొందరు కోర్టును ఆశ్రయించాలని యోచిస్తున్నారు. అయితే విశాఖలో ఐదేళ్లకు మించి పనిచేస్తున్న వారిని ఏజెన్సీకి పంపేందుకు అధికార యంత్రాంగం నిర్ణయించిందన్న సంకేతాలు వస్తున్నాయి. ఇదిలావుండగా తమకు అనుకూల ప్రాంతాల్లో పోస్టింగుల కోసం ఇప్పటికే పలువురు ఉద్యోగులు పైరవీలు సాగిస్తున్నారు.

గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా 67 మందికి పదోన్నతి

▸▸ 86 మంది హెచ్‌ఎంలకు బదిలీ

ఉమ్మడి విశాఖ జిల్లాలో జడ్పీ, మునిసిపల్ ఉన్నత పాఠశాలల్లో 86మంది గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులకు బదిలీ చేశారు. వీరిలో జడ్పీ పాఠశాలల హెచ్‌ఎంలు 71 మంది, మునిసిపల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 15 మంది ఉన్నారు. బదిలీల అనంతరం ఉమ్మడి జిల్లాలో 67 గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులకు గురువారం సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. స్కూలు అసిస్టెంట్లలో సీనియారిటీ జాబితాను ఖరారు చేసి 67 ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలగా నియమించారు. వీరిలో జడ్పీ పాఠశాలల్లో 66 మంది, మునిసిపాలిటీలో ఒకరిని నియమించారు.

ఉక్కు యాజమాన్యంపై కాంట్రాక్టు కార్మికుల కన్నెర్ర

... 5వ పేజీ తరువాయి

కాంట్రాక్టు కార్మికులు కోరుతున్నారు. 'కాంట్రాక్టు కార్మికుల సమ్మె-పరిష్కారం' అనే అంశంపై కార్మికశాఖ అధికారులతో శుక్రవారం చర్చలు జరగనున్నాయని, అక్కడ కూడా ఇదే డిమాండ్‌ను వెల్లడిస్తామని చెబుతున్నారు. ప్లాంటులో ఉద్యోగుల సంఖ్య భారీగా తగ్గించాలని యాజమాన్యం లక్ష్యంగా పెట్టుకుందని, వారికి పరిహారం ఇవ్వడానికి కూడా బడ్జెట్ పెట్టుకుందని,అందులో కాంట్రాక్టు కార్మికులను ఎందుకు చేర్చడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. 'గేట్లు మూసేసి.. పనుల నుంచి తీసేశాం వెళ్లిపొండి' అంటే ఎలా వెళ్లిపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్నామని, తమకు ఏదో ఒక దారి యాజమాన్యమే చూపాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు ఆర్‌ఎల్‌సీ సమక్షంలో చర్చలు

ఉక్కుటౌన్ షిప్: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, కాంట్రాక్టు కార్మిక సంఘాల మధ్య రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్‌ఎల్‌సీ) సమక్షంలో శుక్రవారం చర్చలు జరగనున్నాయి. ప్రస్తుతం కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మెలో ఉన్న నేపథ్యంలో ఈ చర్చలు ఆసక్తికరంగా మారాయి. గతంలో పలు మార్లు చర్చలు జరిగినప్పటికీ కార్మికులకు అనుకూలంగా ఏ నిర్ణయం రాలేదని, ఈసారైనా కార్మికులకు అనుకూలంగా నిర్ణయం వస్తుందని వారంతా ఆశగా ఎదురు చూస్తున్నారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపు అంశంపై ఇప్పటికే తాము స్పష్టమైన నిర్ణయం చెప్పామని, ఎవరినీ తొలగించబోమని ఉక్కు యాజమాన్యం స్పష్టమైన హామీ ఇవ్వాలని కార్మిక నాయకులు కోరుతున్నారు.

యాచకులకు అడ్డాగా బస్టాపులు!

... 5వ పేజీ తరువాయి

వారంతా ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ వ్యాపకాలను చూసుకుని చీకటిపడిన తరువాత తమను అధికారులు చేర్చిన ఆశ్రయ కేంద్రానికి వెళ్లి నిద్రపోవాల్సి ఉంటుంది. కానీ యాచకులు, ఎలాంటి ఆసరా లేక రోడ్లపై తిరిగేవారిని ఎప్పటికప్పుడు గుర్తించి ఆశ్రయ కేంద్రాలకు తరలించాల్సిన బాధ్యతను పోలీస్, జీవీఎంసీ యూసీడీ సిబ్బంది విస్మరించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో యాచకులు, నిరాశ్రయులు పగలు, రాత్రి అనే తేడా లేకుండా బస్ షెల్టర్లలోనే గడుపుతున్నారని పలువురు నగరవాసులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ, పోలీస్, అధికారులు స్పందించి బస్ షెల్టర్లలో ఉంటున్న యాచకులు, నిరాశ్రయులను స్పెషల్ డ్రైవ్ ద్వారా గుర్తించి సమీపంలోని ఆశ్రయ కేంద్రాలకు తరలించాలని కోరుతున్నారు.

నగరంలో మిలాన్

... 5వ పేజీ తరువాయి

విన్యాసాలనే (మల్టీలేటరల్ నేవల్ ఎక్సర్‌సైజ్- మిలాన్)గా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రపతి దేశానికి సర్వ సైన్యాధ్యక్షుడు. త్రివిధ దళాలకు ముఖ్య అధిపతి. రాష్ట్రపతి నౌకాదళాలను సమీక్షించడాన్ని 'ప్రెసిడెంట్స్ ఫ్లీట్ రివ్యూ (పీఎఫ్ఆర్)' అంటారు. పూర్తిగా భారతదేశ నౌకలను సమీక్షిస్తే పీఎఫ్ఆర్‌గా పేర్కొంటారు. ఇందులో విదేశీ నౌకలు కూడా పాల్గొంటే.. దానిని 'అంతర్జాతీయ ఫ్లీట్‌రివ్యూ (ఐఎఫ్ఆర్)'గా పిలుస్తారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో మిలాన్‌తో పాటు ఐఎఫ్ఆర్ కూడా నిర్వహించనున్నట్టు తూర్పు నౌకాదళం చీఫ్ ఆఫ్‌స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా విజయవాడలో బుధవారం వెల్లడించారు. ప్రతి రెండేళ్లకోసారి మిలాన్ నిర్వహించడం ఆనవాయితీ. అప్పట్లో అండమాన్ కేంద్రంగానే ఈవిన్యాసాలు జరిగేవి. అయితే ఇందులో పాల్గొనే దేశాల సంఖ్య పెరగడంతో వేదికను విశాఖపట్నానికి మార్చారు.తొలి మిలాన్ 2020లో జరగాల్సి ఉండగా కరోనా వల్ల వాయిదా పడింది. ఇక్కడే 2022లో మొదటి మిలాన్‌ను, ఆ తరువాత 2024లో రెండో మిలాన్‌ను నిర్వహించారు. వచ్చే ఫిబ్రవరిలో నిర్వహించేది మూడో మిలాన్. సుమారు 145 దేశాలకు ఆహ్వానం పంపినట్టు నేవీ అధికారులు చెబుతున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆపరేషన్ డెమో (సాహస విన్యాసాల ప్రదర్శన), ఆకాశంలో యుద్ధ విమానాల విన్యాసాలు (ఫ్లై పాస్ట్), వివిధ దేశాల ప్రతినిధులతో ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ వంటివి నిర్వహిస్తారు. వీటికి రాష్ట్రపతి, ప్రధాని, వివిధ దేశాల ప్రతినిధులు హాజరవుతారు. ఈనేపథ్యంలో నగరానికి కొత్త సొబగులు అద్దుతారు.. అందంగా తీర్చిదిద్దుతారు.

4న శిథిల భవనాల తొలగింపునకు వేలం

భీమునిపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీచ్ రోడ్‌లో వున్న గురుకుల బాలికల పాఠశాల ఆవరణలో శిథిలమైన భవనాలను తొలగించ డానికి వచ్చే నెల 4న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పాఠశాలలో డైనింగ్ హాల్, వంట గది, స్టోర్ రూమ్స్ భవనాలు శిథిలమయ్యాయని, విద్యార్థుల భద్రత దృష్ట్యా ఆయా భవనాలను తొలగించాలని నిర్ణయించామన్నారు.

నేడు కిరండోల్ రైలు సర్వీసులు రద్దు

అక్కయ్యపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక కారణాల వల్ల శుక్రవారం విశాఖ-కిరండోల్ (58501) రైళ్ల సర్వీసులను రద్దు చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.కెందీప్ తెలిపారు. అలాగే తిరుగు ప్రయాణంలోని కిరండోల్-విశాఖ (58592) నంబరు గల ప్యాసింజర్ రైలుతో పాటు కిరండోల్-విశాఖ (18516) నైట్ ఎక్స్‌ప్రెస్ రైలును కూడా రద్దు చేసినట్టు వెల్లడించారు.

జోత్స్నకల్పనకు ఏయూ డాక్టరేట్ ప్రదానం



జోత్స్నకల్పనకు పీహెచ్‌డీ డిగ్రీ ప్రదానం చేస్తున్న వీసీ రాజశేఖర్

వెంకోజీపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి) : హైబ్రిడ్ మిశ్రమాల పనితీరును మెరుగుపరచడానికి ఉపరితల మార్పు చేసిన నానో పదార్థాలు వాడకంపై చేసిన పరిశోధనకు వి.జోత్స్నకల్పనకు ఏయూ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. గురువారం ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ తన కార్యాలయంలో కల్పనకు డాక్టరేట్ పత్రాన్ని అందజేశారు. ఏయూలోని మెరైన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి వీవీఎస్ ప్రసాద్ సారధ్యంలో కల్పన పరిశోధనను కొనసాగించారు. తన పరిశోధనకు సహకరించిన ఆచార్యులకు కల్పన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు

మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలంకు 'తెలుగుశక్తి' బీవీ రామ్ పరామర్శ



పల్లా సింహాచలంను పరామర్శిస్తున్న తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్

ఆరిలోవ, మే 29 (ఆంధ్రజ్యోతి) : గత కొన్నాళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతూ హెల్త్ సిటీలో గల ఒక ప్రైవేటు ఆస్పత్రిలోచికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యే పల్లా సింహచలంను 'తెలుగుశక్తి' పార్టీ అధ్యక్షుడు బీవీ రామ్ గురువారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. పల్లా సింహచలం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు పల్లా సింహాచలం కుమార్తె పులిచర్ల రాజేశ్వరి, కుమారుడు పల్లా శంకరరావులు తమ తండ్రి ఆరోగ్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

కార్మికులపై కేసులా?

అఖిలపక్ష కార్మిక సంఘం నేతలు

ఉక్కుటౌన్‌షిప్, మే 29 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో పోరాటాలు చేస్తున్న కాంట్రాక్టు కార్మికులపై యాజమాన్యం కేసులు పెట్టడం సరికాదని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. టౌన్‌షిప్‌లో గురువారం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ గతంలో లేని సంస్కృతికి యాజమాన్యం తెరలేపుతోందని, ఇది సరికాదని అన్నారు.

సినిమా గైడ్

- **భైరవం** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కరాటే కిడ్** : శారద
- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం)
- **ఫైనల్ డెస్టినేషన్** : రమాదేవి,
- **సింగిల్** : మెలోడీ, కామేశ్వరి, గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 16, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 18, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 32, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 15, క్యారెట్ 38 దొండకాయలు 20, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది)54, బరబాటి 28, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోసకాయలు 14, వె ల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 100, కీర దోస 28, కాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

మృత్యు మార్గంగా మద్దిలపాలెం రహదారి

- వారం రోజుల్లో రెండు రోడ్డు ప్రమాదాలు : ఇద్దరి మృతి
- వాహనాల పార్కింగ్ కారణంగా ఇటీవల అరకొరగా రోడ్డు నిర్మాణం
- అదే ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు



కార్ల పార్కింగ్ వల్ల సగం వేసిన మద్దిలపాలెం రోడ్డులో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు

మద్దిలపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం నుంచి సత్యం జంక్షన్ వైపు వెళ్లే జాతీయరహదారి మృత్యుమార్గంగా మారింది. ఈ మార్గంలో ఆరు రోజుల వ్యవధిలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. తండ్రితో ప్రయాణిస్తున్న కుమార్తెను, కాబోయే భార్యతో వెళ్తున్న భర్తను బలి తీసుకుని వారి ఇంట తీవ్ర విషాదాన్ని నింపింది. సగం నిర్మాణం జరిగిన రోడ్డులో వాహనాల పార్కింగ్ వల్ల ఈ ప్రమాదాలు సంభవించాయి. అయినా ట్రాఫిక్ పోలీసులు అక్రమ పార్కింగ్ విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. జాతీయ రహదారుల సంస్థ హైవే అధికారులు, ట్రాఫిక్ పోలీసులు కూడా వాహనాలు తీయించి ప్రమాదభరితంగా ఉన్న రోడ్డు నిర్మాణాలు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా ప్రయాణికుల ప్రాణాలు హరించుకుపోతున్నాయని పలువురు అంటున్నారు.

మద్దిలపాలెం నుంచి సత్యం జంక్షన్ వరకూ జాతీయ రహదారిని ఇటీవల వేశారు. అయితే మద్దిలపాలెం వద్ద జాతీయ రహదారిపై ఉన్న సిటీ కార్స్ నుంచి వంద మీటర్ల వరకూ వాహనాలు పార్కింగ్ చేయడంతో అక్కడ కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. రెండు లైన్లుగా ఉన్న ఈ రోడ్డులో ఒక లైన్ రోడ్డు వేసి వాహనాలు పార్కింగ్ చేసిన లైన్‌ను విడిచిపెట్టేశారు. దీంతో అక్కడ సుమారు వంద మీటర్ల వరకు అసంపూర్తి రోడ్డు పనులతో ప్రమాదభరితంగా మారింది. ఈ ప్రాంతంలోనే ఈ నెల 23న వేకువజామున ద్విచక్రవాహనంపై స్కూటర్‌పై తండ్రితో వెళుతున్న పీజీ మెడికో విద్యార్థిని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఏకంగా ఆమెపై నుంచి లారీ చక్రాలు వెళ్లడం నుజ్జునుజ్జయింది.

అదే ప్రాంతంలో ఈ నెల 27న అర్ధరాత్రి 12.30 గంటలకు మరో రోడ్డు ప్రమాదం సంభవించింది. కాబోయే భార్యతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మురళీనగర్‌కు చెందిన రాగతి రాము (32) భీమిలీ సమీపం పెదనాగమయ్యపాలెంలో పండుగకు వెళ్లి వస్తుండుగా ఈ ప్రమాదం జరిగింది.

సిటీ కార్స్ ఎదురుగానే ఈ రెండు ప్రమాదాలు ఒకేలా, ఒకే ప్రాంతంలో జరిగాయి. ఇక్కడ ఒక లైను రోడ్డు వేయడంతో అదే లైన్‌లో వాహనాలన్నీ వెళ్లడంతో వెనుక నుంచి వచ్చి ముందున్న బైక్‌లను ఢీకొంటున్నాయి. ద్విచక్రవాహనాదారులకు పక్కకు జరగడానికి రోడ్డులేక లారీల కిందకు వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కింగ్ చేసిన వాహనాలను తీయించి రోడ్డులు వేయిస్తారో లేక మరిన్ని ప్రమాదాలు జరగడానికి కారణమవుతారో వేచి చూడాలి.

పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథా



ఫౌంటేన్‌లా లీక్ అవుతున్న తాగునీరు



పైపు లీకేజీతో చిత్తడిగా మారిన మార్గం

వెంకోజీపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డులో కొత్త వెంకోజీపాలెం కొండవాలు ప్రాంతంలో మంచినీటి సరఫరా అయ్యే పైపులైను లీక్ కావడంతో తాగునీరంతా వృథాగా పోతోంది. నీరు ఎగజిమ్ముతూ ఫౌంటేన్‌ను తలపించేలా లీక్ అవుతూ పక్కనే ఉన్న కాలువలో కలిసిపోతోంది. ఇలా నీరు లీక్ కావడంతో కొండవాలు ప్రాంతంలోని నివాసాలకు వెళ్లే మార్గం చిత్తడిగా మారింది. దీంతో నివాసాలకు వెళ్లే వారంతా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మళ్లీ నీటి సరఫరా నిలిపినంత వరకు ఈ నీరు సుమారు గంట పాటు వృథాగా పోతోంది. జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు దీనిపై దృష్టి సారించి లీకేజీ సమస్యలను పరిష్కరించి నీరు వృథా కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

యూజీడీ తవ్వకాల వద్ద కుంగిన రోడ్డు



పెదగదిలో యూజీడీ మ్యాన్‌హోల్ వద్ద కుంగిన రోడ్డు

ఆరిలోవ. మే 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 12వ వార్డులోని పెదగదిలి జంక్షన్‌లో మాజీ మేయర్ కాంపు కార్యాలయానికి సమీపంలో గల రోడ్డు కుంగిపోయింది. గతంలో ఒకసారి ఇదే విధంగా కుండిపోగా, అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

యూజీడీ పైప్‌లైన్ వేసేటపుడు గోతులను పూర్తిగా క్రషర్ బూడిద వేసి దానిపై పూర్తి స్థాయిలో నీరు వేసిన అనంతరం మట్టి వేసినట్టయితే రోడ్లు కుంగిపోకుండా ఉంటుంది, కానీ సంబంధిత అధికారులు పర్యవేక్షణ లోపించడంతో పనులు నాణ్యతతో చేపట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి.

యూజీడీ పైపులైన్లు వేసిన అనంతరం రోడ్లు పూడ్చే క్రమంలో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. నామ్ కే వాస్తేగా పనులు చేయడం, నాసిరకంగా పనులు చేపట్టంతో ప్రజలు పడాల్సి వస్తోందని అంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రోడ్లు ఈ విధంగా కుంగిపోవడంతో రాత్రి సమయంలో వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయని, దీనివల్ల వాహనదారులు గాయాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా యూజీడీ తవ్వకాలు చేపట్టిన తర్వాత నాణ్యతతో రోడ్లు పూడ్చాలని కోరుతున్నారు.

పొగాకు నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

డీసీసీబీ రిటైర్డ్ మేనేజర్ శివప్రసాద్



శివప్రసాద్ సేకరించిన.. ధూమపానప్రియులు ఉపయోగించే పరికరాలు

వెంకోజీపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి) : పొగాకు ప్రభావం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు, సమాజానికి అవగాహన కల్పించాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రిటైర్డ్ మేనేజర్, కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు పీఆర్‌వో జీఎస్ శివప్రకాష్ అన్నారు. ఈ నెల 31 ప్రపంచ పొగాకు రహిత దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని పలు సంస్థలను కోరారు. శివప్రకాష్ ప్రతిఏటా తాను సేకరించిన సిగరేట్ తాగే వారు ఉపయోగించే పలు రకాల పరికరాలను ఆయన పురాతన వస్తు సేకరణలో భాగంగా సేకరించి, పొగాకు వ్యతిరేక దినోత్సవం రోజున పొగాకు వల్ల అనర్థాలపై యువకులకు అవగాహన కల్పిస్తూ ఉంటారు. అలాగే ఈ నెల 31న జేఆర్‌నగర్‌లోని తన ఇంటి వద్ద ఈ పరికరాలతో పలువురు యువకులకు అవగాహన కల్పించనున్నారు. ఆర్థిక నష్టాలు, పర్యావరణం కలుషితం కావటానికి, అనేక వ్యాధులకు, ఉత్పాదకత నష్టాలకు కారణమవుతున్న పొగాకును నిర్మూలించాలని శివప్రకాష్ సూచించారు.

పొగాకు వినియోగం కారణంగా ఏటా ప్రపంచవ్యాప్తంగా సుమారు 90 లక్షల మంది, అందులో మన భారతదేశంలో సుమారు 15 లక్షల మంది మృత్యువాత పడుతున్నారని చెప్పారు. క్యాన్సర్, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ వంటి వ్యాధులు సంభవిస్తున్నాయన్నారు. పొగాకు వలన పర్యావరణం దెబ్బ తినడంతో పాటు, నీరు కలుషితం అవ్వటమే కాక విషపూరితం అవుతున్నాయన్నారు.

అసంపూర్తిగా మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతు

- యూజీడీ సిబ్బంది నిర్వాకంపై స్థానికుల అసంతృప్తి



యూజీడీ సిబ్బంది మరమ్మతు చేయకుండా వదిలేసిన మ్యాన్‌హోల్

వెంకోజీపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డు సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్ హోల్స్ పొంగి మురుగునీరు రోడ్డుపై పారుతుందని బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి యూజీడీ సిబ్బంది స్పందించారు. అయితే కొన్ని మ్యాన్‌హోల్స్ మాత్రమే తాత్కాలికంగా సరిచేసి మిగిలిన వాటిని అలానే వదిలేశారు. హెచ్‌బీ కాలనీ శివాలయం వైపు వెళ్లే మ్యాన్‌హోల్స్‌ను బాగుచేసి, హెచ్‌బీ కాలనీ బస్టాప్ వెళ్లే మ్యాన్‌హోల్‌లను మాత్రం పట్టించుకోకుండా వదిలేశారు.

ఇదేమిటని ప్రశ్నించగా.. సిబ్బంది దురుసుగా సమాధానమిచ్చారని స్థానికులు తెలిపారు. వర్షాలు పడుతున్న వేల తాము ఎన్నాళ్లిల్లా కంపును భరించాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఆక్రమిత స్థలంలో కంటైనర్ తొలగింపు



కంటైనర్‌ను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

ఆరిలోవ, మే 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల దీనదయాళ్‌పురంలో బీఆర్టీఎస్ రోడ్డును ఆనుకొని ఉన్న సర్వీసు రోడ్డులో ఏర్పాటు చేసిన కంటైనర్‌ను జీవీఎంసీ పట్టణ ప్రణాళిక సిబ్బంది గురువారం తొలగించారు. జోన్-2 అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఆదేశాల మేరకు దీన్ని తొలగించినట్టు సిబ్బంది తెలిపారు. ఆరిలోవ ప్రాంతంలో ఎక్కడ పడితే అక్కడ ఫుట్‌పాత్‌లను ఆక్రమించి బడ్డీలు, కంటైనర్లను ఏర్పాటు చేస్తున్నారు. కొంత మంది టీడీపీ నాయకులు సహకారంతో ఈ ఆక్రమణలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టడంతో ఆక్రమణదారులకు హెచ్చరించినట్టయిందని స్థానికులు అంటున్నారు.

జల్లు కురిస్తే.. రహదారుల జలమయం

చిన్నపాటి వర్షాలకే వరదమయం అవుతున్న ఎంవీపీ కాలనీ రహదారులు



చిన్న వర్షం వచ్చినా చెరువులా కనిపించే ఎంవీపీ డబుల్ రోడ్డు

ఎంవీపీ కాలనీ, మే 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోనే పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందిన ప్రాంతంగా చెప్పుకునే ఎంవీపీ కాలనీలో చినుకు పడితే ఈ ప్రాంతీయులకు దిగులే. కాస్తా వర్షం పడినా పలు ప్రాంతాలు జలమయం అవుతుంటాయి. కొద్దిగా గాలులు వీచినా, రోడ్డు పక్కన ఉన్న చెట్ల కొమ్మలు పడి, ద్విచక్ర వాహనాలు, కార్లు వంటివి దెబ్బ తింటాయి. ముఖ్యంగా ఎంవీపీ డబుల్ రోడ్డు పరిస్థితి చాలా దారుణంగా ఉంటుంది. కొద్దిపాటి వర్షానికే రోడ్లు పూర్తిగా మునిగిపోతాయి. గత రెండు రోజులుగా కురిసిన వర్షానికి రోడ్డు జలమయం అయింది. మోకాళ్ల లోతు నీరు నిలిచిపోయి, పాదచారులకు, ద్విచక్రవాహనదారులకు చాలా ఇబ్బంది ఎదురయ్యింది. ఫుట్‌పాత్‌లు సైతం నీటిలో మునిగిపోవడంతో సమీపంలోని ఇళ్లు, వాణిజ్య సంస్థలు ఇబ్బందులకు గురయ్యాయి. వచ్చే వర్షపు నీటి ప్రవాహం వెనువెంటనే డ్రైయినేజీల్లోకి వెళ్లకపోవడంతో, వర్షం కురుస్తున్నంత సేపూ, భారీగా జలమయమవుతోంది. తగ్గిన గంట వరకూ కొంతమేర నీరు నిలిచిపోతోంది. ఏళ్లతరబడి ఇదే సమస్య ఇక్కడ ఉన్నా, దీనిని పరిష్కరించే ఆలోచన అధికారులు చేయడంలేదని ఈ ప్రాంతీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'మరో చరిత్ర'తో తెలుగు ప్రజలు నన్ను హీరోగా ఆదరించారు

- ఇప్పటికీ చాలా మంది మా సొంతూరు విశాఖపట్నం అనుకుంటారు
- ప్రముఖ నటుడు కమల్‌హాసన్
- 'జగన్నాథ రథచక్రాలు వస్తున్నాయ్..' అంటూ శ్రీశ్రీ కవితను వినిపించి అలరించిన కమల్
- ఘనంగా 'థగ్‌లైఫ్' ప్రీ రిలీజ్ వేడుక



వేదికపై కమల్‌హాసన్, శింబు, త్రిష, నాజర్, అభిరామి తదితరులు

సిరిపురం, మే 29 (ఆంధ్రజ్యోతి) : 'మరో చరిత్ర' చిత్రం షూటింగ్ కోసం తొలిసారిగా విశాఖపట్నం వచ్చానని, ప్రశాంతమైన వాతావరణంలోని అప్పుడు ఎవరూ తనను గుర్తుపట్టలేదని... షూటింగ్ అంతా ఎంతో సౌకర్యంగా జరిగిందని, 'మరో చరిత్ర' చిత్రం ద్వారా తెలుగు ప్రజలు తనను ఎంతో ఆదరించారని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ పేర్కొన్నారు. గురువారం రాత్రి సిరిపురం గురజాడ కళాక్షేత్రంలోని 'థగ్‌లైఫ్' చిత్రం ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో పాల్గొన్న కమల్‌హాసన్ మాట్లాడుతూ.. విశాఖపట్నం అంటే తనకు హోమ్ సిటీ లాంటిదన్నారు. ఇప్పటికీ చాలా మంది తన మిత్రులు, ఇతరులు సైతం తన ఫోన్ చేసి ఏమీ... మీ సొంతూరు వెళ్లలేదా..? అంటారని సొంతూరు అంటే విశాఖపట్నంలో కలుద్దామని చెబుతుంటారని, అంతటి అనుబంధం నాకు విశాఖపట్నంతో ఉందన్నారు. ఎన్నో గొప్ప చిత్రాల్లో తాను నటించానని, ఆయా చిత్రాలు గొప్పగా రావడానికి దర్శకులే కారణమన్నారు. అయితే కొన్ని చిత్రాలు ఫెయిల్ అయ్యాయని, అందుకు మాత్రం తానే కారణమన్నారు. విశాఖపట్నంలోని జొన్నవలసలో 'శుభసంకల్పం' చిత్రం షూటింగ్ చేశామని, ఇప్పటికీ నాకు అవన్నీ గుర్తు ఉన్నాయన్నారు. 'సాగరసాగమం'తో పాటు మరికొన్ని చిత్రాలు కూడా ఇక్కడ షూటింగ్ చేశామన్నారు. మణిరత్నంతో చేసిన నాయకుడు గొప్ప విజయం సాధించిందని, అలాగే 'థగ్‌లైఫ్' చిత్రం చాలా బాగా వచ్చిందన్నారు. ఇందులోని నా పాత్రకు సమానంగా విలన్‌గా పాత్ర ఉంటుందన్నారు. ఏ చిత్రంలోనైనా విలన్ పాత్ర హీరోకి దీటుగా ఉండాలని అప్పుడే హీరో అవుతారని లేకపోతే జీరో అవుతారన్నారు. 'థగ్‌లైఫ్' జూన్ 5 విడుదల కానుందని, మంచి విజయాన్ని సాధిస్తుందన్న నమ్మకంగా ఉందన్నారు. హీరో శింబుతో కలిసి నటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. హీరోయిన్ త్రిషతో మరోసారి స్క్రీన్ షేర్ చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. నాకు ఎప్పటి నుంచో తెలిసిన స్నేహితుడు నాజర్‌తో మరోసారి నటించడం గొప్ప అనుభూతిని ఇచ్చిందన్నారు.

ఈ సందర్భంగా శ్రీశ్రీ రాసిన 'పతితులార...భ్రష్టులార..బాధాసర్పదష్టులార... ఏడవకండి.. ఏడవకండి.. జగన్నాథ రథచక్రాలు వస్తున్నాయ్..వస్తున్నాయ్.. భూకంపం పుట్టిస్తా..' అంటూ కమల్‌హాసన్ చెప్పడంతో చప్పట్లు, కేరింతలతో ఒక్కసారిగా ఆడిటోరియం దద్దరిల్లింది.

హీరో శింబు మాట్లాడుతూ కమల్ సార్‌తో పని చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు నన్ను చాలా బాగా ఆదరిస్తున్నారన్నారు. తన తొలిచిత్రం విశాఖలోని షూటింగ్ చేశానన్నారు. ఇక్కడ బీచ్ తనకు ఎంతో ఇష్టమన్నారు. ఆయన స్వయంగా పాడిన 'బుజ్జిపిల్లా...'పాటను ఆలపించి అలరించారు. త్వరలో 'ఓజీ' చిత్రంలో కూడా నేను పాడబోతున్నానన్నారు.

హీరోయిన్ త్రిష మాట్లాడుతూ కమల్‌హాసన్‌తో పని చేయడం గొప్పగా భావిస్తున్నానన్నారు. ఈ చిత్రాన్ని మీరంతా బాగా ఆదరిస్తారని నమ్మకం ఉందన్నారు. వర్షం సమయంలోని ఇక్కడకొచ్చానని మీ ప్రేమకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

మరో హీరోయిన్ అభిరామి మాట్లాడుతూ 'చెప్పవే చిరుగాలి..' చిత్రం విశాఖలోనే షూటింగ్ చేశామని, మళ్లీ ఇన్ని రోజులకు ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్టు నాజర్ మాట్లాడుతూ 'థగ్‌లైఫ్' చిత్రం చాలా బాగుంటుందన్నారు. గొప్పనటులతో కలిసి పనిచేయడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో నిర్మాత సుధాకర్, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.



అభిమానులకు అభివాదం చేస్తున్న కమల్‌హాసన్

పేదల ఆకలి తీర్చడమే ఉచిత మొబైల్ వాహన లక్ష్యం



అభ్యాగులు, బిచ్చగాళ్లకు భోజనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

సిరిపురం, మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఆకలి దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని వివిధ ప్రాంతాల్లోని అభ్యాగులు, బిచ్చగాళ్లకు ఉచితంగా ఆహారాన్ని అందించడమే తమ లక్ష్యమని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రతినిధి ఫెబిన్ తెలిపారు. ఉచిత భోజన మొబైల్ వాహనం ద్వారా ఆర్టీసీ కాంప్లెక్స్, సిరిపురం డౌన్,ఆశీల్‌మెట్ట, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లోని ఉచితంగా భోజనాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రతి రోజు 4100 మందికి ఈ భోజనాలను అందజేస్తామన్నారు. దీంతోపాటు ఆరోగ్య సంరక్షణ, విద్య ఆంశాలపై కూడా సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకున్న జీవీఎంసీ అధికారులు

మద్దిలపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం విద్యానగర్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణంపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'భవన నిర్మాణంలో బిల్డర్ మాయాజలం' కథనానికి జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించారు. గురువారం నిర్మాణాలను పరిశీలించి రెండో అంతస్తు నిర్మాణానికి సిద్ధం చేసిన సెంటరింగ్‌ను తొలగించారు. ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలను చేపట్టిన సదరు బిల్డర్‌కు నోటీసులు జారీ చేశారు. పనులు చేపట్టకుండా ఉండాలని నిర్మాణదారులకు హెచ్చరించారు. చట్టానికి లోబడి తదుపరి చర్యలు తీసుకుంటామని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ తెలిపారు.

'సిమెంట్ ధరలపై ప్రభుత్వం దృష్టి సారించాలి'

వేపగుంట, మే 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భవన నిర్మాణ రంగం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిలదొక్కుకుంటుందన్న తరుణంలో సిమెంట్ ధరలు దాదాపు రూ. 150 పెరగడంతో బిల్డర్లు ఆందోళ చెందుతున్నారు. దీంతో నిర్మాణాలు నిలిపేసే పరిస్థితి ఏర్పడిందని జోన్ 8 బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.వి.రామరాజు పేర్కొన్నారు. సిమెంట్ ధరలు పెరుగుదలపై జోన్ 8 బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం సింహపురికాలనీ కార్యలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. గతంలో ఇసుక ధరలతో ఇబ్బందులు ఎదుర్కొంటే, ఇప్పుడు సిమెంట్ కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి ఒకేసారి సిమెంట్ ధరను 150 నుంచి 375కు చేరడంతో పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.

జూలై 8న కుంచుమాంబ అమ్మవారి ప్రధాన పండుగ



మాధవధార, మే 29 (ఆంధ్రజ్యోతి) ; విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని మాధవధార పురాతన ఆలయం శ్రీకుంచుమాంబ అమ్మవారి ఆలయ ప్రధాన పండుగను జులై 8న (మంగళవారం) నిర్వహించనున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలోని పెద్దల సమక్షంలో పండుగ తేదీలను ఖరారు చేశారు. గత కొన్నేళ్లుగా అమ్మవారి పండుగ ఉత్సవాల్ని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే, గ్రామంలోని మరో రెండు ఆలయాలుగా ఉన్న సీతన్న గార్డెన్స్ ప్రాంతంలోని కనకమహాలక్ష్మి పండుగను జులై 17వ తేదీన, బిర్లా జంక్షన్‌లోని కొత్త మహాలక్ష్మి అమ్మవారి పండుగను జులై 20న నిర్వహించేందుకు పెద్దలంతా కలసి నిర్ణయించినట్టు తెలిపారు. అలాగే ఉత్సవ నిర్వహణ కమిటీని సమావేశంలో ఏర్పాటు చేశారు. పండుగ ఏర్పాట్లు, అతిథులకు ఆహ్వానం నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రధానంగా భక్తులకు దర్శన ఏర్పాట్లు మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు నిర్ణయించినట్టు గ్రామ పెద్దలు తెలిపారు.

జ్ఞానాపురంలో కలుషిత తాగునీరు సరఫరా

» తరచూ ఇదే సమస్య ఎదురవుతోందంటున్న స్థానికులు
» శాశ్వత పరిష్కారం చూపాలంటూ వినతి



కొళాయిల ద్వారా సరఫరా అయిన బురదనీరు



కాలువ నుంచి వచ్చిన పైపులైన్

జ్ఞానాపురం, మే 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 41వ వార్డు పరిధిలోని జ్ఞానాపురంలోని మాన్యువల్ వీధి, రోసియోలియన్ వీధిలో గత రెండు రోజులుగా తాగునీటి కొళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతుండడంత స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తొలువ మంగళవారం తాగునీరు కలుషితంగా రావడంతో ఏదో సమస్యతో వచ్చిందనుకున్నామని, కానీ బుధవారం కూడా మురుగు నీరు రావడంతో ఆందోళనా ఉందని స్థానిక మహిళలు అంటున్నారు. ఈ నీటిని తాగితే వ్యాధులు ప్రబలడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు మహిళలు ఈ సమస్యను స్థానిక కూటమి నాయకుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు జీవీఎంసీ వాటర్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో వాటర్ సప్లయ్ విభాగం ఏఈ శివకుమార్ జ్ఞానాపురంలోని పలు ప్రాంతాలో పైపులైన్లను పరిశీలించి మాన్యువల్ వీధిలో సమస్యను గుర్తించి మరమ్మతులు చేసి పైపులైన్ల ద్వారా నీటిని సరఫరా చేసి పరిశీలించారు.

అయితే ఈ సమస్య ఈ రెండు రోజులే కాకుండా పదేపదే ఉత్పన్నమవుతోందని స్థానికులు అంటున్నారు. కొళాయిల ద్వారా బురద నీరు, కాలువ నీరు వస్తుందని పైపులైన్లను జీవీఎంసీ అధికారులు మరమ్మతులు చేయకపోవడం చాలా చోట్ల కాలువల నుంచి పైపులైన్లు ఉండడంతో ఇటువంటి సమస్య వస్తోందని వాపోతున్నారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని జీవీఎంసీ అధికారులను కోరుతున్నారు



పూర్తిగా శిథిలమై తుప్పలు, డొంకలతో ఉన్న మెట్లు

అధ్వానంగా మాధవధార మెట్ల మార్గం

సింహాచలం, మే 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మాధవధార నుంచి సింహగిరికి వెళ్లే మెట్ల మార్గం అధ్వానంగా ఉంది. రవాణా సదుపాయం లేని రోజుల్లో ఈ మార్గం ద్వారానే భక్తులు సింహగిరికి చేరుకుని స్వామివారిని దర్శించుకునేవారు. ఆలయంలో పలు సేవలకు అవసరమైన సరకులను కూలీలు మెట్ల మార్గంలో మోసుకుని తీసుకువెళ్లేవారు. 1963లో సింహగిరికి ఘాట్ రోడ్డు నిర్మించిన తరువాత ఈ మార్గం దాదాపుగా మరుగనపడింది. ప్రస్తుతం కొందరు యువకులు ట్రక్కింగ్‌కు వినియోగిస్తుండగా, మరికొందరు కార్తీక మాసంలో వనభోజనాలకు పిక్నిక్ స్పాట్‌గా ఉపయోగిస్తున్నారు. పర్యాటకంగా నగరానికి చేరువగా ఉన్న ఈ సుందరమైన మార్గాన్ని దేవస్థానం అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో మెట్లన్నీ శిథిలావస్థకు చేరుకుని, రాళ్లు తేలాయి. అలాగే మార్గం మొత్తం తుప్పలు, డొంకలు పేరుకుపోయాయి. దీనివల్ల ట్రక్కింగ్‌కు వెళ్లే వారు అవస్థలు పడతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

31న జిల్లా మహిళా హాకీ జట్టు ఎంపిక

అక్కయ్యపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా జూనియర్ మహిళల హాకీ జట్టు ఎంపికలు ఈ నెల 31న సాలిగ్రామపురంలోని హాకీ మైదానంలో నిర్వహించనున్నట్టు హాకీ విశాఖ సంఘం కార్యదర్శి కేవీ ఆంజనేయ తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారిణులు 2006 జనవరి 1, ఆ తర్వాత జన్మించిన వారై ఉండాలని చెప్పారు. ఆసక్తి గల వారు ఈ నెల 31న సాయంత్రం 3:45 గంటలకు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో మైదానంలో హాజరు కావాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు జూన్ 6 నుంచి భీమవరంలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీలో ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ : 98851 99535 లో సంప్రదించాలని కోరారు.

1న జిల్లా చదరంగం జట్టు ఎంపిక

అక్కయ్యపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఆల్ విశాఖ చెస్ సంఘం, చైతన్య చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 1వన ఏయూ ఎంబీఏ విభాగ హాలులో జిల్లా చదరంగం జట్టు ఎంపిక నిర్వహించనున్నట్టు సంఘం కార్యదర్శి మణికంఠ తెలిపారు. ఈ పోటీల్లో అన్ని వయస్సు గల వారు పాల్గొనవచ్చని, ఆసక్తి గలవారు ఈ నెల 31లోగా ఫోన్ : 9849371760లో సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారుఎన్టీఆర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు.

హెచ్ఆర్సీ జిల్లా కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గం

అక్కయ్యపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి) : హ్యూమన్ రైట్ సెల్ (హెచ్ఆర్సీ) విశాఖ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలతెలుగు ఉపాధ్యాయుడు, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎంఎస్వీ విశ్వనాథం నియమితులయ్యారు. ఎన్జీజీవోస్ కాలనీలోని కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో వారికి హెచ్ఆర్సీజాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.రామకృష్ణ, ఎంపీ శ్రీనివాసరావు నియామక పత్రాన్ని అందజేశారు. అలాగే ఇతర కమిటీ ప్రతినిధులను కూడా నియమించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జీఎస్ఎన్ రాజు, ఉపాధ్యక్షుడిగా ఎస్.దొరబాబు, మహిళా ఉపాధ్యక్షురాలిగా దీనా కుమారి, జాయింట్ సెక్రటరీలుగా కుప్పిలి గోవింద్ పట్నాయక్, ఎస్.కుశ్వంత్, కోశాధికారిగా పి.సత్యనారాయణరెడ్డి నియమితులయ్యారు. నూతన కార్యవర్గానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేఎం నాయుడు అభినందనలు తెలిపి ప్రమాణ స్వీకారం చేయించారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన మీడియా కో-ఆర్డినేటర్ గోపాల్‌రెడ్డి



మంత్రి లోకేశ్‌తో మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

అక్కయ్యపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న మహానాడులో పాల్గొన్న విశాఖ జిల్లా టీడీపీ మీడియా కోఆర్డినేటర్ కె.గోపాల్‌రెడ్డి బుధవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మంత్రి లోకేశ్‌కు అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై నాడు విశాఖ విమానాశ్రయంలో జరిగిన దాడి కేసు త్వరితగతిన పునర్విచారణ చేసి ఆ దాడికి కారకుడైన వైసీపీ నేత కేకే రాజుతో పాటు, అందులో భాగస్వాములైన అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని కోరినట్టు గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందిస్తూ మహానాడు తర్వాత ఈ విషయమై దృష్టి సారిస్తానని చెప్పినట్టు గోపాల్‌రెడ్డి చెప్పారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : ఎంఈవో దివాకర్



పర్యవేక్షిస్తున్న ఎంఈవో దివాకర్

కంచరపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి) : యోగాతో మానసిక ప్రశాంతత లభించి, సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంఈవో డి.దివాకర్ పేర్కొన్నారు. ఆర్పీపేట పాఠశాలోలలో గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులకు యోగాసనాలు, వాటి ప్రాధాన్యాన్ని వివరిస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఎంఈవో దివాకర్ మాట్లాడుతూ యోగా సర్వరోగ నివారిణి అని, ప్రతి ఒక్కరూ దైనందిన జీవనంలో తప్పనిసరిగా విధిగా యోగా చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన కార్యక్రమానికి మండలం నుంచి విద్యార్థులకు తర్ఫీదును అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం యోగా ప్రాముఖ్యతపై వివిధ పోటీలను నిర్వహించారు. హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు స్వాతి, నళిని, సునీత, లావణ్య పాల్గొన్నారు.

కరోనాపై అప్రమత్తం

... 5వ పేజీ తరువాయి

అర్బన్ సెంటర్‌లో కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. తగ్గని జ్వరం, జలుబుతో వచ్చి కరోనా లక్షణాలు కనిపిస్తే.. అటువంటి వారికి ఈ ఆర్‌టీపీసీఆర్ కిట్ ద్వారా పరీక్ష చేస్తున్నారు. వాటిని కేజీహెచ్‌లోని వీఆర్‌డీఎల్ కేంద్రానికి పంపుతున్నారు. ఇప్పటివరకు రెండు కేసులు తప్ప మళ్లీ ఇప్పటివరకు ఎటువంటి పాజిటివ్ కేసు రాలేదని వైద్య వర్గాలు చెబుతున్నాయి. ప్రతిఒక్కరూ మాస్కులు ధరించాలని, శానిటైజర్‌ను వాడాలని అధికారులు చెబుతున్నారు.

వైద్యుల సూచన మేరకే మందులు

నగరంలో నెల రోజుల నుంచి అత్యధికులు జలుబు, జ్వరం, దగ్గులతో బాధపడుతున్నారు. ఇవి ఈ సీజన్‌లో వచ్చే జ్వరాలేనని చాలామంది సర్ది చెప్పుకుంటున్నారు. అయితే ఇవి కుటుంబంలో ఒకరికి వస్తే ఆ తరువాత మిగిలిన వారికీ వస్తున్నాయి. ఒకరి తరువాత ఒకరు చికిత్స తీసుకోవాల్సి వస్తోంది. ఈ జ్వరాలకు సొంత వైద్యం తీసుకోకుండా, మందుల షాపుల్లో ఇచ్చిన మాత్రలు వేసుకోకుండా డాక్టర్‌ను సంప్రతించి, వారి సూచనల మేరకు చికిత్స తీసుకోవాలని సీనియర్ వైద్యుడు, కేజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ సోమయాజులు సూచించారు.

నగరంలో మిలాన్

... 5వ పేజీ తరువాయి

విన్యాసాలనే (మల్టీలేటరల్ నేవల్ ఎక్సర్‌సైజ్ -మిలాన్)గా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రపతి దేశానికి సర్వ సైన్యాధ్యక్షుడు. త్రివిధ దళాలకు ముఖ్య అధిపతి. రాష్ట్రపతి నౌకాదళాలను సమీక్షించడాన్ని 'ప్రెసిడెంట్స్ ఫ్లీట్ రివ్యూ (పీఎఫ్ఆర్)' అంటారు. పూర్తిగా భారతదేశ నౌకలను సమీక్షిస్తే పీఎఫ్ఆర్‌గా పేర్కొంటారు. ఇందులో విదేశీ నౌకలు కూడా పాల్గొంటే.. దానిని 'అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్)'గా పిలుస్తారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో మిలాన్‌తో పాటు ఐఎఫ్ఆర్ కూడా నిర్వహించనున్నట్టు తూర్పు నౌకాదళం చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా విజయవాడలో బుధవారం వెల్లడించారు. ప్రతి రెండేళ్లకోసారి మిలాన్ నిర్వహించడం ఆనవాయితీ. అప్పట్లో అండమాన్ కేంద్రంగానే ఈ విన్యాసాలు జరిగేవి. అయితే ఇందులో పాల్గొనే దేశాల సంఖ్య పెరగడంతో వేదికను విశాఖపట్నానికి మార్చారు. తొలి మిలాన్ 2020లో జరగాల్సి ఉండగా కరోనా కారణంగా వాయిదా పడింది. ఇక్కడే 2022లో మొదటి మిలాన్‌ను, ఆ తరువాత 2024లో రెండో మిలాన్‌ను నిర్వహించారు. వచ్చే ఫిబ్రవరిలో నిర్వహించేది మూడో మిలాన్. సుమారు 145 దేశాలకు ఆహ్వానం పంపినట్టు నేవీ అధికారులు చెబుతున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆపరేషన్ డెమో (సాహస విన్యాసాల ప్రదర్శన), ఆకాశంలో యుద్ధ విమానాల విన్యాసాలు (ఫ్లై పాస్ట్), వివిధ దేశాల ప్రతినిధులతో ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ వంటివి నిర్వహిస్తారు. వీటికి రాష్ట్రపతి, ప్రధాని, వివిధ దేశాల ప్రతినిధులు హాజరవుతారు. ఈ నేపథ్యంలో నగరానికి కొత్త సొబగులు అద్దుతారు.. అందంగా తీర్చి దిద్దుతారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జ్ఞానాపురం, మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని జనసేన నాయకుడు, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. గురువారం ఆయన వార్డు పరిధిలోని దేవాంగుల వీధి, అల్లిపురం బజార్, నంది వీధి ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతిరోజూ సాయంత్రం వార్డు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని, ఏ సమస్య ఉన్నా..తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సహకారంతో వార్డులో రూ. 3 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేశామన్నారు.

రేపు ఆర్‌కే బీచ్‌లో సూర్య నమస్కారాలు

మహారాణిపేట, మే 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆర్‌కే బీచ్‌లో శనివారం మూడు వేల మందితో సూర్య నమస్కారాలు చేయనున్నట్టు ఆయూష్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ ఝాన్సీ తెలిపారు. గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్ 21న నగరంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా కాళీ మాత ఆలయం ఎదుట ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

సచివాలయ ఉద్యోగులకు యోగా శిక్షణ



యోగాసాధన చేస్తున్న జోనల్ కమిషనర్ రాము, తదితరులు

మురళీనగర్, మే 29 (ఆంధ్రజ్యోతి) ; నగరంలోని బీచ్ రోడ్డులో జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా మాధవస్వామి కల్యాణ మండపంలో తొమ్మిది వార్డుల సచివాలయ ఉద్యోగులకు గురువారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. జోన్-5 కమిషనర్ బి. రాము ఈ కార్యక్రమాన్ని ఆరంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ఈ కార్యక్రమానికి హాజరుకానుండడంతో అందరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు.అనంతరం యోగ మాస్టర్ ట్రైనీలు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 50, 51వ వార్డుల టీడీపీ అధ్యక్షులు వరప్రసాద్, ననపల కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి యజమానిపై పోలీసులకు ఫిర్యాదు

మహారాణిపేట, మే 29 (ఆంధ్రజ్యోతి) : తాను లేని సమయంలో తన షాపులో సరకులు చక్కబెట్టిన ఇంటి యజమానిని ప్రశ్నించిన దుకాణదారుడ్ని చంపేస్తానని బెదిరించడంతో బాధితుడు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బానోజీనగర్‌లో డి. మారుతీ కుమార్‌కు చెందిన రెండు అంతస్తుల దుకాణాన్ని అంధవరపు స్వామి అనే వ్యక్తి 2017లో అద్దెకు తీసుకొని బొమ్మల దుకాణం పెట్టాడు, తన భార్య ఆరోగ్యం బాగాలేకపోవడంతో స్వామి దుకాణం మూసివేశాడు. మూడు నెలలుగా అతను అద్దె చెల్లించలేదు. ఈక్రమంలో ఇంటి యజమాని మారుతీకుమార్ అద్దెకు ఉంటున్న వారికి చెప్పకుండా దుకాణం బోర్డులు తొలగించి, అందులో ఉన్న స్టాక్‌ను మాయం చేశాడు. అంతేకాకుండా దుకాణంలో ఉన్న నగదు కూడా తీసుకున్నాడు. దీనిపై ఇంటి యజమానిని అడిగితే చంపేస్తానని బెదిరించడంతో స్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సతీశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

రుషికొండ బీచ్‌లో వ్యర్థాలు తొలగింపు



ఎక్స్‌కవేటర్‌తో దుస్తులను తొలగిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలు వాడి పారేసిన దుస్తులన్నీ గెడ్డల ద్వారా సముద్రంలో కలిసి రుషికొండ బీచ్‌కే చేరుతున్నాయి. ఇటు ఫిషింగ్ హార్బర్ నుంచి అటు భీమిలి వరకు అనేక బీచ్‌లు ఉన్నా ఏ తీరానికి కూడా పాత దుస్తులు కొట్టుకురావడం లేదు. కేవలం రుషికొండ తీరానికి మాత్రమే రోజూ టన్నుల కొద్దీ వస్తున్నాయి. ఉదయం పూట ఒడ్డు వరకు సముద్రపు కెరటాలు వస్తున్నాయి. అప్పుడు ఎలాంటి ఇబ్బంది ఉండడం లేదు.మధ్యాహ్నం రెండు గంటలు దాటిన తరువాత సముద్రం పోటు తగ్గి నీరంతా లోపలికి వెళ్లిపోతోంది. అప్పుడు ఈ దుస్తులన్నీ ఇసుకలో కూరుకుపోయి ఉండిపోతున్నాయి. ఇక్కడ ఎక్కడైతే బోటు షికారుకు అనువైన ప్రాంతంగా ఎంపిక చేసి పర్యాటకుల కోసం బోట్లు నడుపుతున్నారో అక్కడికే ఈ దుస్తులన్నీ కొట్టుకువస్తున్నాయి. గత వారం రోజులుగా ఇదే జరుగుతోంది. రోజూ జీవీఎంసీ సిబ్బంది సుమారు టన్నుల వరకు వీటిని తొలగించి లారీల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. గురువారం పాత దుస్తులు పెద్ద ఎత్తున తీరమంతా పరుచుకుని ఉండడంతో సిబ్బందితో సాధ్యం కాదని ఎక్స్‌కవేటర్‌ను తెప్పించి తొలగించారు. సుమారు నాలుగు టన్నుల దుస్తులను తొలగించినట్టు బీచ్ నిర్వాహకులు తెలిపారు.



కూలిన ఇనుప మెట్లు (ఇన్‌సెట్లో) గాయపడిన అటెండర్

జిల్లా ఖజానా కార్యాలయంలో కూలిన ఇనుప మెట్లు

విశాఖపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఖజానా కార్యాలయంలో ఇనుప మెట్లు కూలిపోయాయి. భవనంలో కింది అంతస్తు నుంచి మొదటి అంతస్తుకు వెళ్లడానికి మెట్ల మార్గం వినియోగిస్తారు. గురువారం మధ్యాహ్నం అటెండరు ప్రసాద్ పై అంతస్తుకి వెళుతుండగా ఒక్కసారిగా మెట్ల మార్గం కుప్పకూలిపోయింది. దీంతో ఆయన తలకు దెబ్బతగలడంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా ఖజానా కార్యాలయం భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పాటు మెట్లు మార్గం కూడా బాగా పాడైంది. మెట్ల మార్గం మూసివేయకుండా విడిచిపెట్టడంతో ఈ సంఘటన జరిగిందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రసాదాల నాణ్యతలో రాజీపడొద్దు : ఈఓ

సింహాచలం, మే 29 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామి ప్రసాదాల తయారీ నాణ్యతలో రాజీపడొద్దని ఈఓ వేంద్ర త్రినాథరావు ఆదేశించారు. గురువారం ఆయన ప్రసాదాల విక్రయ కేంద్రాన్ని పరిశీలించారు. రోజువారీ విక్రయాలు, తయారీ సంఖ్య, ఓపెనింగ్, క్లోజింగ్ స్టాక్‌ల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతపై స్వ యంగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు పర్యవేక్షణాధికారి ప్రసాద్, డీఈఈ రామరాజు (హరి) ఉన్నారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, మే 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక వేదికపై అధి ష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలను బయటకు తీసి భక్తులతో తాకించిన తరువాత బేడా మండపంలో ప్రదక్షిణ జరిపారు. ఉభయ దాతల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శత నామావళి పఠిస్తూ అన్ని నామాలకు స్వర్ణ పుష్పాలతో పూజలు చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్యకల్యాణం నిర్వహించారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, మే 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని చినముషిడివాడ ప్రాంతానికి చెం దిన ఎస్. నరసింగరావు, వరలక్ష్మీ దంపతులు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,00,116లను ప్రజా సంబంధాల విభాగం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు గురువారం వారు నగదు రూపంలో అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి, శేషవస్త్రంతో సత్కరించి, ప్రసాదాలను అందజేశారు

1న పైడితల్లమ్మ పండగ నిర్వహణపై గ్రామ సభ

సింహాచలం, మే 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి సోదరి, అడివివరం తదితర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పైడితల్లెమ్మ వార్షిక పండుగ నిర్వాహణ విషయమై చర్చించేందుకు జూన్ 1న గ్రామసభ ఏర్పాటు చేయనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ సభ వరాహ పుష్కరిణికి వెళ్లే మార్గంలోని దేవస్థానానికి చెందిన నృసింహ సదన్‌లో ఆ రోజు ఉదయం 11.00 గంటలకు జరుగుతుంద న్నారు.

యాచకులకు అడ్డాగా బస్టాపులు!

... 5వ పేజీ తరువాయి

వారంతా ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ వ్యాపకాలను చూసుకుని చీకటిపడిన తరువాత తమను అధికారులు చేర్చిన ఆశ్రయ కేంద్రానికి వెళ్లి నిద్రపోవాల్సి ఉంటుంది. కానీ యాచకులు, ఎలాంటి ఆసరా లేక రోడ్లపై తిరిగేవారిని ఎప్పటికప్పుడు గుర్తించి ఆశ్రయ కేంద్రాలకు తరలించాల్సిన బాధ్యతను పోలీస్, జీవీఎంసీ యూసీడీ సిబ్బంది విస్మరించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దీంతో యాచకులు, నిరాశ్రయులు పగలు, రాత్రి అనే తేడా లేకుండా బస్ షెల్టర్లలోనే గడుపుతున్నారని పలువురు నగరవాసులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ, పోలీస్, అధికారులు స్పందించి బస్ షెల్టర్లలో ఉంటున్న యాచకులు, నిరాశ్రయులను స్పెషల్ డ్రైవ్ ద్వారా గుర్తించి సమీపంలోని ఆశ్రయ కేంద్రాలకు తరలించాలని కోరుతున్నారు.

ఉక్కు యాజమాన్యం తీరుపై కాంట్రాక్టు కార్మికుల కన్నెర్ర

... 5వ పేజీ తరువాయి

కాంట్రాక్టు కార్మికులు కోరుతున్నారు. 'కాంట్రాక్టు కార్మికుల సమ్మె-పరిష్కారం' అనే అంశంపై కార్మికశాఖ అధికారులతో శుక్రవారం చర్చలు జరగనున్నాయని, అక్కడ కూడా తాము ఇదే డిమాండ్‌ను వెల్లడిస్తామని చెబుతున్నారు. ప్లాంటులో ఉద్యోగుల సంఖ్యను భారీగా తగ్గించాలని యాజమాన్యం లక్ష్యంగా పెట్టుకుందని, వారికి పరిహారం ఇవ్వడానికి కూడా బడ్జెట్ పెట్టుకుందని, అందులో కాంట్రాక్టు కార్మికులను ఎందుకు చేర్చడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. 'గేట్లు మూసేసి.. పనుల నుంచి తీసేశాం వెళ్లిపోండి' అంటే ఎలా వెళ్లిపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్లాంటును నమ్ముకుని 20 ఏళ్లుగా పనిచేస్తున్నామని, ఏదో దారి యాజమాన్యమే తమకు చూపాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు ఆర్ఎల్‌సీ సమక్షంలో చర్చలు

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, కాంట్రాక్టు కార్మిక సంఘాల మధ్య రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) సమక్షంలో శుక్రవారం చర్చలు జరగనున్నాయి. ప్రస్తుతం కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మెలో ఉన్న నేపథ్యంలో ఈ చర్చలు ఆసక్తికరంగా మారాయి. గతంలో పలు మార్లు చర్చలు జరిగినప్పటికీ కార్మికులకు అనుకూలంగా ఏ నిర్ణయం రాలేదని, ఈసారైనా కార్మికులకు అనుకూలంగా నిర్ణయం వస్తుందని వారంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపు అంశంపై ఇప్పటికే తాము స్పష్టమైన నిర్ణయం చెప్పామని, ఎవరినీ తొలగించబోమని ఉక్కు యాజమాన్యం స్పష్టమైన హామీ ఇవ్వాలని కార్మిక నాయకులు కోరుతున్నారు.

రెవెన్యూ బదిలీలకు రంగం సిద్ధం

... 5వ పేజీ తరువాయి

పంపారు. ఆ తరువాత పదోన్నతులు రావడంతో కొందరు జూనియర్లు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సీనియర్ అసిస్టెంట్ల నుంచి డీటీలుగా, డీటీల నుంచి తహశీల్దార్లుగా పదోన్నతులు పొందారు. విశాఖలో పనిచేసేవారు ఎక్కువమంది ఇక్కడ నుంచి అల్లూరి జిల్లాకు వెళ్లడానికి ఇష్టపడడం లేదనే వాదన వినిపిస్తోంది. దీంతో చాలామంది ఉద్యోగులు ఏజెన్సీలోనే పనిచేస్తున్నారు. వీరిలో 50 ఏళ్లు పైబడినవారు, పలు రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు ఉన్నారని వారంతా వాపోతున్నారు. 60 ఏళ్లు పైబడిన తహశీల్దార్ ఒకరు తనను మైదానంలోకి బదిలీ చేయాలని ఏడాదిగా కోరుతున్నారు. ఇందుకు అనుగుణంగా ఏజెన్సీలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు ఇటీవల విశాఖ కలెక్టర్‌ను కలిసి తమను మైదానంలోకి బదిలీ చేయాలని వినతిపత్రం అందజేశారు. 50 ఏళ్ల వయసు దాటిన ఉద్యోగులను ఏజెన్సీకి బదిలీ చేయరాదని, ఒకవేళ చేసినా రెండేళ్ల తరువాత తిరిగి మైదానానికి పంపాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కాగా నిబంధనల మేరకు బదిలీలు చేసి.. ఏజెన్సీలో పనిచేసిన వారిని మైదానానికి పంపించకపోతే కొందరు కోర్టును ఆశ్రయించాలని యోచిస్తున్నారు. అయితే విశాఖలో ఐదేళ్లకు మించి పనిచేస్తున్న వారిని ఏజెన్సీకి పంపేందుకు అధికార యంత్రాంగం నిర్ణయించిందన్న సంకేతాలు వస్తున్నాయి. ఇదిలావుండగా తమకు అనుకూల ప్రాంతాల్లో పోస్టింగుల కోసం ఇప్పటికే పలువురు ఉద్యోగులు పైరవీలు సాగిస్తున్నారు.

గ్రేడ్-2 హెచ్ఎంలుగా 67 మందికి పదోన్నతి

» 86 మంది హెచ్ఎంలకు బదిలీ

ఉమ్మడి విశాఖ జిల్లాలో జడ్పీ, మునిసిపల్ ఉన్నత పాఠశాలల్లో 86మంది గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులకు బదిలీ చేశారు. వీరిలో జడ్పీ పాఠశాలల హెచ్ఎంలు 71 మంది, మునిసిపల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 15 మంది ఉన్నారు. బదిలీల అనంతరం ఉమ్మడి జిల్లాలో 67 గ్రేడ్-2 హెచ్ఎం పోస్టులకు గురువారం సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. స్కూలు అసిస్టెంట్లలో సీనియారిటీ జాబితాను ఖరారు చేసి 67 ఉన్నత పాఠశాలల హెచ్ఎంలుగా నియమించారు. వీరిలో జడ్పీ పాఠశాలల్లో 66 మంది, మునిసిపాలిటీలో ఒకరిని నియమించారు.

తుది దశలో నిలిచిన గ్రంథాలయ భవన నిర్మాణ పనులు

ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్న ప్రజలు

అక్కిరెడ్డిపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు, ప్రజలకు విజ్ఞానాన్ని అందించే ప్రభుత్వ గ్రంథాలయ భవన నిర్మాణ పనులు తుది దశలో నిలిచిపోవడం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. సుమారు నలభై ఏళ్ల క్రితం నాతయ్యపాలెం పంచాయతీగా ఉన్న సమయంలో స్థానికులకు విజ్ఞానాన్ని అందించాలన్న ఉద్దేశంతో అప్పటి గ్రంథాలయ శాఖ పంచాయతీ కార్యాలయంలోనే లైబ్రరీని ఏర్పాటు చేసింది. దీనికి గ్రంథాలయాధికారిని కూడా నియమించడంతో పాటు వార్తా పత్రికలు, ఇతర పుస్తకాలు, యువతకు ఉపయోగపడే అన్ని రకాల కాంపిటేటివ్ పుస్తకాలను అందుబాటులో ఉంచడంతో నిత్యం ఈ గ్రంథాలయం పాఠకులతో కళకళలాడేది. కాలక్రమేణ ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో 2023లో దీనిని తొలగించి, ఇందులో ఉన్న పుస్తకాలు, ఫర్నీచర్, తదితర సామగ్రిని స్థానిక కళామందిరం గదిలో భద్రపరచడంతో పాటు లైబ్రేరియన్‌ను వేరే గ్రంథాలయానికి బదిలీ చేశారు. అనంతరం రూ.32 లక్షల వ్యయంతో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి 2023 నవంబరులో అప్పటి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. సంబంధిత కాంట్రాక్టరు తనకు కేటాయించిన రూ.32 లక్షలకు తగ్గట్టుగా భవన నిర్మాణాన్ని చేపట్టారు. ఈ భవన నిర్మాణ పనులు 90 శాతం వరకు పూర్తవ్వగా.. ఇంకా తలుపులు, గచ్చులు, చిన్న చిన్న ప్లాస్టింగ్ పనులు, విద్యుత్ పరికరాలను అమర్చడం వంటివి చేయాల్సి ఉంది. నిధుల కొరతతోనే ఈ పనులు నిలిచిపోయినట్టు తెలిసింది. కొత్త గ్రంథాలయం ప్రారంభానికి నోచుకోకపోవడంతో కళామందిరంలో భద్రపరిచిన పుస్తకాలు, ఫర్నీచర్ పాడైపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. 68, 69 వార్డులకు సంబంధించి తుది దశలో ఉన్న ఈ గ్రంథాలయ భవన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు చొరవ చూపాలని వారు కోరుతున్నారు.


నిర్మాణ పనులు నిలిచిపోయిన నాతయ్యపాలెం గ్రంథాలయ భవనం

త్వరితంగా పునఃప్రారంభించాలి

-గవర వెంకటరమణ, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు



ప్రస్తుతం ఎంతోమంది స్థానిక విద్యార్థులు వివిధ ఉద్యోగ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ఇలాంటి సమయంలో వారికి ఉపయుక్తంగా ఉండవలసిన ఈ గ్రంథాదాలయం మూతపడి ఉండడం బాధాకరం. అందువల్ల అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రంథాలయ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి యువతకు అందుబాటులోకి తీసుకురావాలి.

ఉత్సాహంగా ఆటల పోటీలు


ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

పెదగంట్యాడ, మే 29(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు వివిధ క్రీడల్లో పోటీలు జరిగాయి. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయ నిర్వాహణా కమిటీ ఈ పోటీలు నిర్వహించింది. విద్యార్థులు కబడ్డీ, ఖోఖో ఆటలు ఆడారు. పెదగంట్యాడ పరిధిలో పలు పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు వేసవి విజ్ఞాన శిబిరం ముగింపురోజున బహుమతులు ఇస్తామని గ్రంథాలయ నిర్వాహణాధికారి పీవీ రమణ తెలిపారు.

వైభవంగా బంగారమ్మ పండుగ


ప్రత్యేక అలంకరణలో బంగారమ్మ

అక్కిరెడ్డిపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి) : నాతయ్యపాలెం, షీలా నగర్ పరిసర కాలనీల ఆరాధ్యదేవత బంగారమ్మ అనుపోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి ఊరేగింపు ఘనంగా జరిగింది. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంపూర్ణంగా గాయత్రీదేవి వార్షికోత్సవ పూజలు


వేదమాత గాయత్రీదేవి

వేపగుంట, మే 29 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట జంక్షన్‌లో ఉన్న శ్రీ వేద మాత గాయత్రిదేవి తృతీయ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. పూజల్లో భాగంగా గాయత్రిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాలుగు వేల మందికి అన్న సమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నాశైలజ, బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **భైరవం** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కరాటే కిడ్** : శారద
- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం)
- **ఫైనల్ డెస్టినేషన్** : రమాదేవి,
- **సింగిల్** : మెలోడి, కామేశ్వరి, గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 16, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 18, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 32, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 15, క్యారెట్ 38 దొండకాయలు 20, బంగాళ దుంపలు 18, అరటికాయ(పె)9, మునక్కాడలు(కిలో)50, అల్లం (పాతది)54, బరబాటి 28, ముల్లంగి 30, నిమ్మకాయలు(కిలో)80, బద్దచిక్కుడు 40, దోస కాయలు 14, వెల్లులి(పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 28, కాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, , పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన(కట్ట)4, చుక్కకూర (కట్ట)4, పాల కూర(కట్ట)4 ,తోటకూర (కట్ట)4, బూడిదగుమ్మడికాయ20, 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు(కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

'మరో చరిత్ర'తో తెలుగు ప్రజలు నన్ను హీరోగా ఆదరించారు

- ప్రముఖ నటుడు కమల్‌హాసన్
- ఇప్పటికీ చాలా మంది నాది విశాఖపట్నం సొంతూరు అనుకుంటారు
- ఘనంగా 'థగ్ లైఫ్' ప్రీ రిలీజ్ వేడుక
- 'జగన్నాథ రథచక్రాలు వస్తున్నాయ్' అంటూ శ్రీశ్రీ కవితతో అలరించిన కమల్


వేదికపై కమల్‌హాసన్, శింభూ, త్రిష, నాజర్, అభిరామి తదితరులు

సిరిపురం, మే 29 (ఆంధ్రజ్యోతి) : 'మరో చరిత్ర చిత్రం షూటింగ్ కోసం తొలిసారిగా విశాఖపట్నం వచ్చాను. ప్రశాంతమైన వాతావరణంలోని అప్పుడు ఎవరూ నన్ను గుర్తుపట్టలేదు. షూటింగ్ అంతా ఎంతో సౌకర్యంగా జరిగింది. 'మరో చరిత్ర' చిత్రం ద్వారా తెలుగు ప్రజలు నన్ను ఎంతో ఆదరించారు' అని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ పేర్కొన్నారు. గురువారం రాత్రి సిరిపురం గురజాడ కళాక్షేత్రంలోని 'థగ్‌లైఫ్' చిత్రం ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో పాల్గొన్న కమల్‌హాసన్ మాట్లాడుతూ.. విశాఖపట్నం అంటే తనకు హోమ్‌సిటీ లాంటిదన్నారు. ఇప్పటికీ చాలా మంది తన మిత్రులు చతనకు ఫోన్ చేసి 'ఏమీ... మీ సొంతూరు వెళ్లలేదా..?' అంటుంటారని అన్నారు. వాళ్ల దృష్టిలో సొంతూరు అంటే విశాఖపట్నమని అన్నారు. ఎన్నో గొప్ప చిత్రాల్లో తాను నటించానని, ఆయా చిత్రాలు గొప్పగా రావడానికి దర్శకులే కారణమన్నారు. అయితే కొన్ని చిత్రాలు ఫెయిల్ అయ్యాయని, అందుకు మాత్రం తానే కారణమన్నారు. విశాఖపట్నంలోని జొన్నవలసలో 'శుభసంకల్పం' చిత్రం షూటింగ్ చేశామని, ఇప్పటికీ నాకు అవన్నీ గుర్తు ఉన్నాయన్నారు. 'సాగరసాగమం'తో పాటు మరికొన్ని చిత్రాలు కూడా ఇక్కడే షూటింగ్ చేశామన్నారు. మణిరత్నంతో చేసిన నాయకుడు గొప్ప విజయం సాధించిందని, అలాగే 'థగ్‌లైఫ్' చిత్రం చాలా బాగా వచ్చిందన్నారు .ఇందులోని నా పాత్రకు సమానంగా విలన్‌గా పాత్ర ఉంటుందన్నారు. 'థగ్‌లైఫ్' జూన్ 5 విడుదల కానుందని, మంచి విజయాన్ని సాధిస్తుందన్న నమ్మకంగా ఉందన్నారు. శింబు, త్రిషతో కలిసి నటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. నాకు ఎప్పటి నుంచో తెలిసిన స్నేహితుడు నాజర్‌తో మరోసారి నటించడం గొప్ప అనుభూతిని ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ రాసిన 'పతితులార..భ్రష్టులార..బాధాసర్పదష్టులార... ఏడవకండి.. ఏడవకండి.. జగన్నాథ రథచక్రాలు వస్తున్నాయ్.. వస్తున్నాయ్.. భూకంపం పుట్టిస్తా...' అంటూ కమలహాసన్ చెప్పడంతో ఒక్కసారిగా ఆడిటోరియం దద్దరిల్లింది. హీరో శింబు మాట్లాడుతూ కమల్ సార్‌తో పని చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఇక్కడ బీచ్ తనకు ఎంతో ఇష్టమన్నారు. ఆయన స్వయంగా పాడిన 'బుజ్జిపిల్లా...' పాటను ఆలపించి అలరించారు. త్వరలో 'ఓజీ' చిత్రంలో కూడా తాను పాడబోతున్నానన్నారు. హీరోయిన్ త్రిష మాట్లాడుతూ కమల్‌హాసన్‌తో పని చేయడం గొప్పగా భావిస్తున్నానన్నారు. వర్షం సమయంలోని ఇక్కడకొచ్చానని మీ ప్రేమకు ధన్యవాదాలు తెలిపారు. మరో హీరోయిన్ అభిరామి మాట్లాడుతూ 'చెప్పవే చిరుగాలి..' చిత్రం విశాఖలోనే షూటింగ్ చేశామని, మళ్లీ ఇన్ని రోజులకు ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్టు నాజర్ మాట్లాడుతూ 'థగ్‌లైఫ్' చిత్రం చాలా బాగుంటుందన్నారు. కార్యక్రమంలో నిర్మాత సుధాకర్, తదితరులుపాల్గొన్నారు.

బస్సు సదుపాయం కల్పించరూ!

కూర్మన్నపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87 వార్డు కణితి కాళింగ వీధి రామాలయం నుంచి వడ్లపూడి మీదుగా కాంప్లెక్స్‌కు వెళ్లడానికి ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పించాలని తిరుమల నగర్ కాలనీ అసోసియేషన్ కోరారు. స్టీల్‌సిటీ ఆర్టీసీ డిపో మేనేజర్ గౌతమ్ ఛటర్జీ, అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ శ్రీనివాసరావుకు గురువారం వినతి పత్రం అందజేసారు. దీనిలో భాగంగా 87వ వార్డులో సుమారు 25 వేల జనాభా ఉన్నారనీ, సరైన బస్సు సౌకర్యం లేక వివిధ పనుల మీద బయటకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారని వినతిలో పేర్కొన్నారు. గతంలో ఈ కాలనీలు మీదుగా బస్సు సౌకర్యం ఉండేదని, ప్రస్తుతం లేక పోవడంతో అవస్థలు పడుతున్నామని అన్నారు. దువ్వాడ రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, పూర్ణా మార్కెట్‌కు వెళ్లే బస్సులను వడ్లపూడి, కణితి మీదుగా రాకపోకలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన అధికారులు ఆర్ఎం దృష్టికి సమస్యను తీసుకు వెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాలనీ సభ్యులు పాల్గొన్నారు.


ట్రాఫిక్ మేనేజర్ శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేస్తున్న తిరుమల నగర్ కాలనీ వాసులు

మహిళలకు అహల్యబాయి హోల్కర్ ఆదర్శం

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేనంకొండ కృష్ణంరాజు

ఆటోనగర్,మే 29 (ఆంధ్రజ్యోతి): మహిళలకు రాణి అహల్యబాయ్ హోల్కర్ ఆదర్శమని, ఆమె ఆశయ సాధనకు నేటి తరం మహిళలు కృషి చేయాలని జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు దేనంకొండ కృష్ణంరాజు అన్నారు. జీవీఎంసీ 70 వార్డు ఎల్‌వీ నగర్‌లో గురువారం బీజేపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి కట్టా పద్మ ఆధ్వర్యంలో నిర్వహించిన అహల్యాబాయి హోల్కర్ 300 జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మ రక్షణ కోసం అహల్యాబాయి ఎన్నో దేవవాలయాలను నిర్మించారని అన్నారు. భారతదేశంలో సుమారు 240 దేవాలయాలను అభివృద్ధి చేశారని చెప్పారు. 17వ శతాబ్ధంలో 30 ఏళ్ల పాటు మరాఠా సామ్రాజ్యాన్ని అహల్యాబాయి పాలించారని ఆయన అన్నారు. మండల అధ్యక్షురాలు పావని అహల్యబాయ్ వీరత్వాన్ని కొనియాడారు. ఆమె ఆశయాలకు అనుగుణంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ ధర్మం కోసం సుపరిపాలన అందిస్తున్నారనీ అన్నారు. ఈ కార్యక్రమంలో సంతోశ్, రమేశ్, బుచ్చిరాజు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ జెట్టీ నిర్మించాలి

మత్స్యకారుల డిమాండ్

పెదగంట్యాడ, మే 29(ఆంధ్రజ్యోతి): గంగవరం పోర్టుకు యారాడ బీచ్‌కు మధ్య సాగరతీరంలో ఫిషింగ్ జెట్టీని నిర్మించాలని మత్స్యకారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు గురువారం విజయవాడలో జరిగిన రాష్ట్రమత్స్యకారుల అసోసియేషన్ రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా మత్స్యకార నిర్వాసిత కమిటీ నాయకుడు గంటిపిల్లి అమ్మోరు మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణ దశలోనే ఫిషింగ్ జెట్టీని నిర్మిస్తామని, మత్స్యకారుల వృత్తికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు పట్టించుకోలేదని పేర్కొన్నారు. గంగవరం పోర్టు బెర్తుల సంఖ్య పెరిగితే మత్స్యకారుల్లో ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పిన ప్రజా ప్రతినిధులు ఇప్పటికీ ప్రయత్నాలే చేయలేదని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ వాడకంపై అవగాహన

గోపాలపట్నం, మే 29(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 8వ జోన్ అధికారులు ప్రధాన రహదారి పక్కనే ఉన్న దుకాణాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్న దుకాణాలదారుల నుంచి వాటిని స్వాధీనం చేసుకుని జరిమాన విధించారు. పర్యావరణానికి ముప్పు కలిగించే ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తప్పవని దుకాణదారులకు హెచ్చరించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా నారతో చేసిన సంచులను వినియోగించాలని సూచించారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వేపగుంట, మే 29(ఆంధ్రజ్యోతి): సతివానిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ ఫీడర్‌పై నిర్వాహణ, చెట్ల కొమ్మలు తొలగింపు పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్ 3 ఈఈ, పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా సత్తివానిపాలెం, అహ్మద్‌నగర్, కోటనరవ కాలనీ, ఎమ్.ఈ.ఎస్ లేఔట్ ప్రాంతాల ప్రజలు గమనించాలని తెలియజేశారు.

యోగా శిక్షణలో చురుగ్గా ఉద్యోగులు

కూర్మన్నపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం 87 వార్డు వడ్లపూడి ఆర్యవైశ్య సామాజిక మండపంలోని జీవీఎంసీ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జోనల్ కమిషనర్ శేషాద్రి మాట్లాడుతూ యోగా భారతదేశ వారసత్వ సంపదని, ప్రపంచ వ్యాప్తంగా అందరూ యోగా చేస్తూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటున్నారని అన్నారు. ఏఎంఓహెచ్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ నేటి యాంత్రిక జీవనంలో ప్రతి ఒక్కరు యోగా చేసి మానసిక ప్రశాంతతను, ఒత్తిడి లేని జీవితాన్ని పొందాలని అన్నారు. యోగా గురువు పర్యవేక్షణలో పలువురు యోగాసనాలు వేసి వాటి వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కారుమూరి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.


డీఏవీ స్కూల్‌లో యోగా శిక్షణ ఇస్తున్న దృశ్యం.

వేపగుంట


మహిళా సమాఖ్య కేంద్రంలో యోగా శిక్షణ

బుచ్చిరాజుపాలెం డీఏవీ స్కూల్‌లో జీవీఎంసీ ఈయూసీడీ ఆధ్వర్యంలో వార్డుల వలంటీర్లకు యోగా శిక్షణ శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మిడిరమణ మాట్లాడుతూ యోగా ద్వారా మానసిక, శారీరక ప్రశాంతత కలుగుతుందన్నారు. వైజాగ్‌లో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ చిరంజీవి, ఆర్.పి.లు, స్థానిక నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెందుర్తి

ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సచివాలయ ఉద్యోగులకు యోగా శిక్షణ ఇస్తున్నారు. ఈ క్రమంలో గురువారం పెందుర్తిలోని టీటీడీసీలో గ్రామాల వారిగ ఎంపిక చేసిన సిబ్బందికి యోగా శిక్షణ తరగతుల ఏర్పాటు చేశారు. ఇందులో శిక్షణ పూర్తి చేసుకున్న వారు గ్రామాల్లో యోగా శిక్షణ ఇస్తారు. ఎంపీడీవో గుండాల అప్పలరాజు యోగా శిక్షణ శిబిరాన్ని సందర్శించి యోగాడేను విజయవంతం చేయాలన్నారు.

మల్కాపురం

జూన్ 21న అంతర్జాతీయ దినోత్సవం యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న 32 సచివాలయాల సిబ్బందితో శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రి ప్రాంగణంలో యోగా శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ శిబిరాన్ని జీవీఎంసీ జోన్ 5 కమిషనర్ రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడురోజులు పాటు ఈ శిక్షణ కొనసాగుతుందని అన్నారు. యోగాలో అనుభవజ్ఞులతో శిక్షణ ఇప్పిస్తున్నామని అన్నారు. ప్రతి ఉద్యోగి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులకు కొబ్బరి నూనె డబ్బాలు, సబ్బులు అందజేస్తున్న దృశ్యం

పారిశుధ్య కార్మికులు మరింత కష్టపడాలి

85వ వార్డు కార్పొరేటర్ వరలక్ష్మి

అగనంపూడి, మే 29 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు పారిశుధ్య కార్మికులు మరింత కృషి చేయాలని 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి పేర్కొన్నారు. పెదమడకలోని గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వార్డులోని పారిశుధ్య కార్మికులకు కొబ్బరి నూనె, సబ్బులు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో కార్మికుల సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర, శానటరీ ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య, కూటమి నేతలు పాల్గొన్నారు.

షిరిడి సాయికి ప్రత్యేక పూజలు

అగనంపూడి, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక షిర్డీసాయి బాబా ఆలయంలో విశాఖ షిర్డీసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

కార్మికులపై కేసులు పెట్టడం సరికాదు

అఖిలపక్ష కార్మిక సంఘం నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, మే 29 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో పోరాటాలు చేస్తున్న కాంట్రాక్టు కార్మికులపై యాజమాన్యం కేసులు పెట్టడం సరికాదని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. టౌన్‌షిప్‌లో గురువారం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ గతంలో లేని సంస్కృతికి యాజమాన్యం తెరలేపుతోందని, ఇది సరికాదని అన్నారు. కార్మిక నాయకులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అగనంపూడి, మే 28 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, ఇన్‌డోర్ ఎస్ఎస్ లైన్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అగనంపూడి సెక్షన్ ఏఈ లక్ష్మణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీల, పాతఅగనంపూడి, శ్రీనివాసనగర్, శాంతినగర్, అన్నపూర్ణానగర్, గల్లవాని పాలెం, శనివాడ, జాబిలిహిల్స్, దువ్వాడ, లక్కరాజుపాలెం, యాతపాలెం, శివాజీనగర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

ప్రతి నీటిబొట్టును కాపాడుకోవాలి

సీహెచ్ఆర్వో అరుణ్ లెస్లీ జార్జి



పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు చిత్రించిన చిత్రాలు

మల్కాపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిక్షణతో పాటు ప్రతి నీటిబొట్టును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కోరమాండల్ ఎరువుల కర్మాగారం అంతర్జాతీయ అధ్యక్షుడు సీహెచ్ఆర్వో అరుణ్ లెస్లీ జార్జి పేర్కొన్నారు. శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'పర్యావరణ పరిరక్షణ, నీటి వనరుల కాపాడుకోవడం' అనే అంశంపై విద్యార్థులకు గురువారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అలాగే నీటి స్వచ్ఛత కీలక పాత్రను సూచించే తామర, లిల్లీ మొక్కలతో అలంకరించిన, వాటర్ గార్డెన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నీటిపై అవగాహన కలిగించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. తమ కంపెని ఇటువంటి కార్యక్రమాలు పోత్సహిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ కంపెనీ సభ్యులు పాల్గొన్నారు.

'సిమెంట్ ధరలపై ప్రభుత్వం దృష్టి సారించాలి'

వేపగుంట, మే 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భవన నిర్మాణ రంగం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిలదొక్కుకుంటుందన్న తరుణంలో సిమెంట్ ధరలు దాదాపు రూ. 150 పెరగడంతో బిల్డర్లు ఆందోళ చెందుతున్నారు. దీంతో నిర్మాణాలు నిలిపేసే పరిస్థితి ఏర్పడిందని జోన్ 8 బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.వి.రామరాజు పేర్కొన్నారు. సిమెంట్ ధరలు పెరుగుదలపై జోన్ 8 బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం సింహపురికాలనీ కార్యలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వాళ్ల ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. గతంలో ఇసుక ధరలతో ఇబ్బందులు ఎదుర్కొంటే, ఇప్పుడు సిమెంట్ కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి ఒకేసారి సిమెంట్ ధరను 150 నుంచి 375కు చేరడంతో పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణ కార్మికులను, బిల్డర్లను ఆదుకోవాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ జీఎంకు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సత్కారం

ఉక్కుటౌన్‌షిప్. మే 29 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ జీఎం (హెచ్ఆర్) జి.గాంధీతో ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ గురువారం ప్లాంట్‌లో సమావేశమైంది. ఉద్యోగుల సంక్షేమానికి, వారి సమస్యలు పరిష్కరించేందుకు గాంధీ చేసిన కృషి ప్రశంసనీయమని కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యవర్గం జీఎంను సత్కరించింది. స్టీల్‌ప్లాంట్ మరింత ప్రగతికి ప్రతి కార్మికుడు కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో భూమి సారవంతం : ఏఓ

పద్మనాభం రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : వేసవి దుక్కుల వల్ల భూమి సారవంతం అవుతుందని ఏఓ ఎంపీ చలం అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తొలకరి వర్షాలకు దుక్కులు చేసుకోవడం వల్ల భూమి సారవంతమై కలుపు మొక్కలు, చీడ పీడలను నివారించవచ్చున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు లోతుగా, ఏటవాలుగా దుక్కి దున్నుకోవడం వల్ల భూమి గుల్లగా మారుతుందని చెప్పారు. దీనివల్ల భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరగడమే కాకుండా తేమలో జీవించే సూక్ష్మజీవులు, వానపాముల సంతతి వృద్ధి చెందుతుందన్నారు.

గొల్లల తాళ్లవలస యువకుల నిజాయతీ

భీమునిపట్నం (రూరల్), మే 29 (ఆంధ్రజ్యోతి) : ఎవరైనా వేలాది రూపాయలతో నగదు ఉన్న బ్యాగు దొరికితే ఎవరికీ తెలియకుండా తమ సొంతానికి వాడుకుంటారు. కానీ మండలంలోని గొల్లల తాళ్లవలస గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు దొరికిన నగదును బాధితుడి చిరునామా తెలుసుకుని, పెద్దల సమక్షంలో అందించి తమ నిజాయతీ చాటుకున్నారు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం అక్కవరం గ్రామానికి చెందిన గారి పైడిరాజు బుధవారం ఆనందపురం మండలం గారిపేటకు బైక్‌పై వెళుతుండగా తాళ్లవలస వద్ద రూ. 60 వేలు నగదు, ప్రాంసరీ నోటు ఉన్న బ్యాగు కింద పడిపోయింది. అతను చూసుకోకుండా వెళిపోయారు. అదే రహదారిలో బైక్‌పై వస్తున్న గొల్లల తాళ్లవలస గ్రామానికి చెందిన గొలగాని గోపాలకృష్ణ, నల్ల గొవింద, కొంగరాని సంతోశ్ బ్యాగును చూశారు. అందులో నగదు, ప్రాంసరీ నోటు ఉండడంతో చిరునామా ఆధారంగా అదే రోజు రాత్రి గారిపేటలో పైడిరాజు ఇంటికి చేరుకుని, బ్యాగును అందిం చారు. యువకుల నిజాయతీని గ్రామస్థులు అభినందించారు.

జూలై 8న కుంచుమాంబ అమ్మవారి ప్రధాన పండుగ



మాధవధార, మే 29 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని మాధవధార పురాతన ఆలయం శ్రీకుంచుమాంబ అమ్మవారి ఆలయ ప్రధాన పండుగను జులై 8న (మంగళవారం) నిర్వహించనున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలోని పెద్దల సమక్షంలో పండుగ తేదీలను ఖరారు చేశారు. గత కొన్నేళ్లుగా అమ్మవారి పండుగ ఉత్సవాల్ని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే, గ్రామంలోని మరో రెండు ఆలయాలుగా ఉన్న సీతన్న గార్డెన్స్ ప్రాంతంలోని కనకమహాలక్ష్మి పండుగను జులై 17వ తేదీన, బిర్లా జంక్షన్‌లోని కొత్త మహాలక్ష్మి అమ్మవారి పండుగను జులై 20న నిర్వహించేందుకు పెద్దలంతా కలసి నిర్ణయించినట్టు తెలిపారు. అలాగే ఉత్సవ నిర్వహణ కమిటీని సమావేశంలో ఏర్పాటు చేశారు. పండుగ ఏర్పాట్లు, అతిథులకు ఆహ్వానం నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రధానంగా భక్తులకు దర్శన ఏర్పాట్లు మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు నిర్ణయించినట్టు గ్రామ పెద్దలు తెలిపారు.

31న జిల్లా మహిళా హాకీ జట్టు ఎంపిక

అక్కయ్యపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా జూనియర్ మహిళల హాకీ జట్టు ఎంపికలు ఈ నెల 31న సాలిగ్రామపురంలోని హాకీ మైదానంలో నిర్వహించనున్నట్టు హాకీ విశాఖ సంఘం కార్యదర్శి కేవీ అంజనేయ తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారిణులు 2006 జనవరి 1, ఆ తర్వాత జన్మించిన వారై ఉండాలని చెప్పారు. ఆసక్తి గల వారు ఈ నెల 31న సాయంత్రం 3:45 గంటలకు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో మైదానంలో హాజరు కావాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు జూన్ 6 నుంచి భీమవరంలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీలో ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ : 98851 99535 లో సంప్రదించాలని కోరారు.

1న జిల్లా చదరంగం జట్టు ఎంపిక

అక్కయ్యపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఆల్ విశాఖ చెస్ సంఘం, చైతన్య చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 1వ న ఏయూ ఎంబీఏ విభాగ హాలులో జిల్లా చదరంగం జట్టు ఎంపిక నిర్వహించనున్నట్టు సంఘం కార్యదర్శి మణికంఠ తెలిపారు. ఈ పోటీల్లో అన్ని వయస్సు గల వారు పాల్గొనవచ్చని, ఆసక్తి గలవారు ఈ నెల 31లోగా ఫోన్ : 9849371760లో సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారుఎన్టీఆర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు.

జ్ఞానాపురంలో కలుషిత తాగునీరు సరఫరా

- తరచూ ఇదే సమస్య ఎదురవుతోందంటున్న స్థానికులు
- శాశ్వత పరిష్కారం చూపాలంటూ వినతి



కొళాయిల ద్వారా సరఫరా అయిన బురదనీరు



కాలువ నుంచి వచ్చిన పైపులైన్

జ్ఞానాపురం, మే 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 41వ వార్డు పరిధిలోని జ్ఞానాపురంలోని మాన్యువల్ వీధి, రోసియోలియన్ వీధిలో గత రెండు రోజులుగా తాగునీటి కొళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతుండడంత స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తొలువ మంగళవారం తాగునీరు కలుషితంగా రావడంతో ఏదో సమస్యతో వచ్చిందనుకున్నామని, కానీ బుధవారం కూడా మురుగు నీరు రావడంతో ఆందోళనా ఉందని స్థానిక మహిళలు అంటున్నారు. ఈ నీటిని తాగితే వ్యాధులు ప్రబలడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు మహిళలు ఈ సమస్యను స్థానిక కూటమి నాయకుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు జీవీఎంసీ వాటర్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో వాటర్ సప్లయ్ విభాగం ఏఈ శివకుమార్ జ్ఞానాపురంలోని పలు ప్రాంతాలో పైపులైన్లను పరిశీలించి మాన్యువల్ వీధిలో సమస్యను గుర్తించి మరమ్మతులు చేసి పైపులైన్ల ద్వారా నీటిని సరఫరా చేసి పరిశీలించారు.

అయితే ఈ సమస్య ఈ రెండు రోజులే కాకుండా పదేపదే ఉత్పన్నమవుతోందని స్థానికులు అంటున్నారు. కొళాయిల ద్వారా బురద నీరు, కాలువ నీరు వస్తుందని పైపులైన్లను జీవీఎంసీ అధికారులు మరమ్మతులు చేయకపోవడం చాలా చోట్ల కాలువల నుంచి పైపులైన్లు ఉండడంతో ఇటువంటి సమస్య వస్తోందని వాపోతున్నారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని జీవీఎంసీ అధికారులను కోరుతున్నారు

హెచ్‌ఆర్సీ జిల్లా కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గం

అక్కయ్యపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి) : హ్యూమన్ రైట్ సెల్ (హెచ్ఆర్సీ) విశాఖ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలతెలుగు ఉపాధ్యాయుడు, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎంఎస్వీ విశ్వనాథం నియమితులయ్యారు. ఎన్జీజీవోస్ కాలనీలోని కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో వారికి హెచ్‌ఆర్‌సీజాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.రామకృష్ణ, ఎంపీ శ్రీనివాసరావు నియామక పత్రాన్ని అందజేశారు. అలాగే ఇతర కమిటీ ప్రతినిధులను కూడా నియమించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జీఎస్ఎన్ రాజు, ఉపాధ్యక్షుడిగా ఎస్.దొరబాబు, మహిళా ఉపాధ్యక్షురాలిగా దీనా కుమారి, జాయింట్ సెక్రటరీలుగా కుప్పిలి గోవింద్ పట్నాయక్, ఎస్.కుశ్వంత్, కోశాధికారిగా పి.సత్యనారాయణరెడ్డి నియమితులయ్యారు. నూతన కార్యవర్గానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేఎం నాయుడు అభినందనలు తెలిపి ప్రమాణ స్వీకారం చేయించారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన మీడియా కో-ఆర్డినేటర్ గోపాల్‌రెడ్డి



మంత్రి లోకేశ్‌తో మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

అక్కయ్యపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న మహానాడులో పాల్గొన్న విశాఖ జిల్లా టీడీపీ మీడియా కోఆర్డినేటర్ కె.గోపాల్‌రెడ్డి బుధవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మంత్రి లోకేశ్‌కు అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై నాడు విశాఖ విమానాశ్రయంలో జరిగిన దాడి కేసు త్వరితగతిన పునర్విచారణ చేసి ఆ దాడికి కారకుడైన వైసీపీ నేత కేకే రాజుతో పాటు, అందులో భాగస్వాములైన అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని కోరినట్టు గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందిస్తూ మహానాడు తర్వాత ఈ విషయమై దృష్టి సారిస్తానని చెప్పినట్టు గోపాల్‌రెడ్డి చెప్పారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : ఎంఈవో దివాకర్



పర్యవేక్షిస్తున్న ఎంఈవో దివాకర్

కంచరపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి) : యోగాతో మానసిక ప్రశాంతత లభించి, సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంఈవో డి.దివాకర్ పేర్కొన్నారు. ఆర్పీపేట పాఠశాలోలలో గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులకు యోగాసనాలు, వాటి ప్రాధాన్యాన్ని వివరిస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఎంఈవో దివాకర్ మాట్లాడుతూ యోగా సర్వరోగ నివారిణి అని, ప్రతి ఒక్కరూ దైనందిన జీవనంలో తప్పనిసరిగా విధిగా యోగా చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన కార్యక్రమానికి మండలం నుంచి విద్యార్థులకు తర్ఫీదును అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం యోగా ప్రాముఖ్యతపై వివిధ పోటీలను నిర్వహించారు. హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు స్వాతి, నళిని, సునీత, లావణ్య పాల్గొన్నారు.



పూర్తిగా శిథిలమై తుప్పలు, డొంకలతో ఉన్న మెట్లు

అధ్వానంగా మాధవధార మెట్ల మార్గం

సింహాచలం, మే 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మాధవధార నుంచి సింహగిరికి వెళ్లే మెట్ల మార్గం అధ్వానంగా ఉంది. రవాణా సదుపాయం లేని రోజుల్లో ఈ మార్గం ద్వారానే భక్తులు సింహగిరికి చేరుకుని స్వామివారిని దర్శించుకునేవారు. ఆలయంలో పలు సేవలకు అవసరమైన సరకులను కూలీలు మెట్ల మార్గంలో మోసుకుని తీసుకువెళ్లేవారు. 1963లో సింహగిరికి ఘాట్ రోడ్డు నిర్మించిన తరువాత ఈ మార్గం దాదాపుగా మరుగనపడింది. ప్రస్తుతం కొందరు యువకులు ట్రెక్కింగ్‌కు వినియోగిస్తుండగా, మరికొందరు కార్తీక మాసంలో వనభోజనాలకు పిక్నిక్ స్పాట్‌గా ఉపయోగిస్తున్నారు. పర్యాటకంగా నగరానికి చేరువగా ఉన్న ఈ సుందరమైన మార్గాన్ని దేవస్థానం అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో మెట్లన్నీ శిథిలావస్థకు చేరుకుని, రాళ్లు తేలాయి. అలాగే మార్గం మొత్తం తుప్పలు, డొంకలు పేరుకుపోయాయి. దీనివల్ల ట్రెక్కింగ్‌కు వెళ్లే వారు అవస్థలు పడతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

కరోనాపై అప్రమత్తం

... 5వ పేజీ తరువాయి

అర్బన్ సెంటర్‌లో కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. తగ్గని జ్వరం, జలుబుతో వచ్చి కరోనా లక్షణాలు కనిపిస్తే.. అటువంటి వారికి ఈ ఆర్‌టీపీసీఆర్ కిట్ ద్వారా పరీక్ష చేస్తున్నారు. వాటిని కేజీహెచ్‌లోని వీఆర్‌డీఎల్ కేంద్రానికి పంపుతున్నారు. ఇప్పటివరకు రెండు కేసులు తప్ప మళ్లీ ఇప్పటివరకు ఎటువంటి పాజిటివ్ కేసు రాలేదని వైద్య వర్గాలు చెబుతున్నాయి. ప్రతిఒక్కరూ మాస్కులు ధరించాలని, శానిటైజర్‌ను వాడాలని అధికారులు చెబుతున్నారు.

వైద్యుల సూచన మేరకే మందులు

నగరంలో నెల రోజుల నుంచి అత్యధికులు జలుబు, జ్వరం, దగ్గులతో బాధపడుతున్నారు. ఇవి ఈ సీజన్‌లో వచ్చే జ్వరాలేనని చాలామంది సర్ది చెప్పుకుంటున్నారు. అయితే ఇవి కుటుంబంలో ఒకరికి వస్తే ఆ తరువాత మిగిలిన వారికీ వస్తున్నాయి. ఒకరి తరువాత ఒకరు చికిత్స తీసుకోవాల్సి వస్తోంది. ఈ జ్వరాలకు సొంత వైద్యం తీసుకోకుండా, మందుల షాపుల్లో ఇచ్చిన మాత్రలు వేసుకోకుండా డాక్టర్‌ను సంప్రదించి, వారి సూచనల మేరకు చికిత్స తీసుకోవాలని సీనియర్ వైద్యుడు, కేజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ సోమయాజులు సూచించారు.

నగరంలో మిలాన్

... 5వ పేజీ తరువాయి

విన్యాసాలనే (మల్టీలేటరల్ నేవల్ ఎక్సర్‌సైజ్-మిలాన్)గా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రపతి దేశానికి సర్వ సైన్యాధ్యక్షుడు. త్రివిధ దళాలకు ముఖ్య అధిపతి. రాష్ట్రపతి నౌకాదళాలను సమీక్షించడాన్ని 'ప్రెసిడెంట్స్ ఫ్లీట్ రివ్యూ (పీఎఫ్ఆర్)' అంటారు. పూర్తిగా భారతదేశ నౌకలను సమీక్షిస్తే పీఎఫ్ఆర్‌గా పేర్కొంటారు. ఇందులో విదేశీ నౌకలు కూడా పాల్గొంటే.. దానిని 'అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్)'గా పిలుస్తారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో మిలాన్‌తో పాటు ఐఎఫ్ఆర్ కూడా నిర్వహించనున్నట్టు తూర్పు నౌకాదళం చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా విజయవాడలో బుధవారం వెల్లడించారు. ప్రతి రెండేళ్లకోసారి మిలాన్ నిర్వహించడం ఆనవాయితీ. అప్పట్లో అండమాన్ కేంద్రంగానే ఈ విన్యాసాలు జరిగేవి. అయితే ఇందులో పాల్గొనే దేశాల సంఖ్య పెరగడంతో వేదికను విశాఖపట్నానికి మార్చారు. తొలి మిలాన్ 2020లో జరగాల్సి ఉండగా కరోనా కారణంగా వాయిదా పడింది. ఇక్కడే 2022లో మొదటి మిలాన్‌ను, ఆ తరువాత 2024లో రెండో మిలాన్‌ను నిర్వహించారు. వచ్చే ఫిబ్రవరిలో నిర్వహించేది మూడో మిలాన్. సుమారు 145 దేశాలకు ఆహ్వానం పంపినట్టు నేవీ అధికారులు చెబుతున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆపరేషన్ డెమో (సాహస విన్యాసాల ప్రదర్శన), ఆకాశంలో యుద్ధ విమానాల విన్యాసాలు (ఫ్లై పాస్ట్), వివిధ దేశాల ప్రతినిధులతో ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ వంటివి నిర్వహిస్తారు. వీటికి రాష్ట్రపతి, ప్రధాని, వివిధ దేశాల ప్రతినిధులు హాజరవుతారు. ఈ నేపథ్యంలో నగరానికి కొత్త సొబగులు అద్దుతారు.. అందంగా తీర్చిదిద్దుతారు.

యాచకులకు అడ్డాగా బస్టాపులు!

... 5వ పేజీ తరువాయి

వారంతా ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ వ్యాపకాలను చూసుకుని చీకటిపడిన తరువాత తమను అధికారులు చేర్చిన ఆశ్రయ కేంద్రానికి వెళ్లి నిద్రపోవాల్సి ఉంటుంది. కానీ యాచకులు, ఎలాంటి ఆసరా లేక రోడ్లపై తిరిగేవారిని ఎప్పటికప్పుడు గుర్తించి ఆశ్రయ కేంద్రాలకు తరలించాల్సిన బాధ్యతను పోలీస్, జీవీఎంసీ యూసీడీ సిబ్బంది విస్మరించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దీంతో యాచకులు, నిరాశ్రయులు పగలు, రాత్రి అనే తేడా లేకుండా బస్ షెల్టర్లలోనే గడుపుతున్నారని పలువురు నగరవాసులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ, పోలీస్, అధికారులు స్పందించి బస్ షెల్టర్లలో ఉంటున్న యాచకులు, నిరాశ్రయులను స్పెషల్ డ్రైవ్ ద్వారా గుర్తించి సమీపంలోని ఆశ్రయ కేంద్రాలకు తరలించాలని కోరుతున్నారు.

ఉక్కు యాజమాన్యం తీరుపై కాంట్రాక్టు కార్మికుల కన్నెర్ర

... 5వ పేజీ తరువాయి

కాంట్రాక్టు కార్మికులు కోరుతున్నారు. 'కాంట్రాక్టు కార్మికుల సమ్మె-పరిష్కారం' అనే అంశంపై కార్మికశాఖ అధికారులతో శుక్రవారం చర్చలు జరగనున్నాయని, అక్కడ కూడా తాము ఇదే డిమాండ్‌ను వెల్లడిస్తామని చెబుతున్నారు. ప్లాంటులో ఉద్యోగుల సంఖ్యను భారీగా తగ్గించాలని యాజమాన్యం లక్ష్యంగా పెట్టుకుందని, వారికి పరిహారం ఇవ్వడానికి కూడా బడ్జెట్ పెట్టుకుందని, అందులో కాంట్రాక్టు కార్మికులను ఎందుకు చేర్చడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. 'గేట్లు మూసేసి.. పనుల నుంచి తీసేశాం వెళ్లిపోండి' అంటే ఎలా వెళ్లిపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్లాంటును నమ్ముకుని 20 ఏళ్లుగా పనిచేస్తున్నామని, ఏదో దారి యాజమాన్యమే తమకు చూపాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు ఆర్ఎల్‌సీ సమక్షంలో చర్చలు

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, కాంట్రాక్టు కార్మిక సంఘాల మధ్య రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) సమక్షంలో శుక్రవారం చర్చలు జరగనున్నాయి. ప్రస్తుతం కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మెలో ఉన్న నేపథ్యంలో ఈ చర్చలు ఆసక్తికరంగా మారాయి. గతంలో పలు మార్లు చర్చలు జరిగినప్పటికీ కార్మికులకు అనుకూలంగా ఏ నిర్ణయం రాలేదని, ఈసారైనా కార్మికులకు అనుకూలంగా నిర్ణయం వస్తుందని వారంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపు అంశంపై ఇప్పటికే తాము స్పష్టమైన నిర్ణయం చెప్పామని, ఎవరినీ తొలగించబోమని ఉక్కు యాజమాన్యం స్పష్టమైన హామీ ఇవ్వాలని కార్మిక నాయకులు కోరుతున్నారు.

రెవెన్యూ బదిలీలకు రంగం సిద్ధం

... 5వ పేజీ తరువాయి

పంపారు. ఆ తరువాత పదోన్నతులు రావడంతో కొందరు జూనియర్లు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సీనియర్ అసిస్టెంట్ల నుంచి డీటీలుగా, డీటీల నుంచి తహశీల్దార్లుగా పదోన్నతులు పొందారు. విశాఖలో పనిచేసేవారు ఎక్కువ మంది ఇక్కడ నుంచి అల్లూరి జిల్లాకు వెళ్లడానికి ఇష్టపడడం లేదనే వాదన వినిపిస్తోంది. దీంతో చాలామంది ఉద్యోగులు ఏజెన్సీలోనే పనిచేస్తున్నారు. వీరిలో 50 ఏళ్లు పైబడినవారు, పలు రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు ఉన్నారని వారంతా వాపోతున్నారు. 60 ఏళ్లు పైబడిన తహశీల్దార్ ఒకరు తనను మైదానంలోకి బదిలీ చేయాలని ఏడాదిగా కోరుతున్నారు. ఇందుకు అనుగుణంగా ఏజెన్సీలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు ఇటీవల విశాఖ కలెక్టర్‌ను కలిసి తమను మైదానంలోకి బదిలీ చేయాలని వినతిపత్రం అందజేశారు. 50 ఏళ్ల వయసు దాటిన ఉద్యోగులను ఏజెన్సీకి బదిలీ చేయరాదని, ఒకవేళ చేసినా రెండేళ్ల తరువాత తిరిగి మైదానానికి పంపాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కాగా నిబంధనల మేరకు బదిలీలు చేసి.. ఏజెన్సీలో పనిచేసిన వారిని మైదానానికి పంపించకపోతే కొందరు కోర్టును ఆశ్రయించాలని యోచిస్తున్నారు. అయితే విశాఖలో ఐదేళ్లకు మించి పనిచేస్తున్న వారిని ఏజెన్సీకి పంపేందుకు అధికార యంత్రాంగం నిర్ణయించిందన్న సంకేతాలు వస్తున్నాయి. ఇదిలావుండగా తమకు అనుకూల ప్రాంతాల్లో పోస్టింగుల కోసం ఇప్పటికే పలువురు ఉద్యోగులు పైరవీలు సాగిస్తున్నారు.

గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా 67 మందికి పదోన్నతి

- 86 మంది హెచ్‌ఎంలకు బదిలీ

ఉమ్మడి విశాఖ జిల్లాలో జడ్పీ, మునిసిపల్ ఉన్నత పాఠశాలల్లో 86మంది గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులకు బదిలీ చేశారు. వీరిలో జడ్పీ పాఠశాలల హెచ్‌ఎంలు 71 మంది, మునిసిపల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 15 మంది ఉన్నారు. బదిలీల అనంతరం ఉమ్మడి జిల్లాలో 67 గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులకు గురువారం సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. స్కూలు అసిస్టెంట్లలో సీనియారిటీ జాబితాను ఖరారు చేసి 67 ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలుగా నియమించారు. వీరిలో జడ్పీ పాఠశాలల్లో 66 మంది, మునిసిపాలిటీలో ఒకరిని నియమించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జ్ఞానాపురం, మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని జనసేన నాయకుడు, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. గురువారం ఆయన వార్డు పరిధిలోని దేవాంగుల వీధి, అల్లిపురం బజార్, నంది వీధి ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతిరోజూ సాయంత్రం వార్డు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని, ఏ సమస్య ఉన్నా..తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సహకారంతో వార్డులో రూ. 3 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేశామన్నారు.

రేపు ఆర్‌కే బీచ్‌లో సూర్య నమస్కారాలు

మహారాణిపేట, మే 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆర్‌కే బీచ్‌లో శనివారం మూడు వేల మందితో సూర్య నమస్కారాలు చేయనున్నట్టు ఆయూష్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ ఝాన్సీ తెలిపారు. గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్ 21న నగరంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా కాళీ మాత ఆలయం ఎదుట ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

సచివాలయ ఉద్యోగులకు యోగా శిక్షణ



యోగాసాధన చేస్తున్న జోనల్ కమిషనర్ రాము, తదితరులు

మురళీనగర్, మే 29 (ఆంధ్రజ్యోతి) ; నగరంలోని బీచ్ రోడ్డులో జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా మాధవస్వామి కల్యాణ మండపంలో తొమ్మిది వార్డుల సచివాలయ ఉద్యోగులకు గురువారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. జోన్-5 కమిషనర్ బి. రాము ఈ కార్యక్రమాన్ని ఆరంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ఈ కార్యక్రమానికి హాజరుకానుండడంతో అందరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు.అనంతరం యోగ మాస్టర్ ట్రైనీలు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 50, 51వ వార్డుల టీడీపీ అధ్యక్షులు వరప్రసాద్, సనపల కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి యజమానిపై పోలీసులకు ఫిర్యాదు

మహారాణిపేట, మే 29 (ఆంధ్రజ్యోతి) : తాను లేని సమయంలో తన షాపులో సరకులు చక్కబెట్టిన ఇంటి యజమానిని ప్రశ్నించిన దుకాణదారుడ్ని చంపేస్తానని బెదిరించడంతో బాధితుడు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బానోజీనగర్‌లో డి. మారుతీ కుమార్‌కు చెందిన రెండు అంతస్తుల దుకాణాన్ని అంధవరపు స్వామి అనే వ్యక్తి 2017లో అద్దెకు తీసుకొని బొమ్మల దుకాణం పెట్టాడు, తన భార్య ఆరోగ్యం బాగాలేకపోవడంతో స్వామి దుకాణం మూసివేశాడు. మూడు నెలలుగా అతను అద్దె చెల్లించలేదు. ఈక్రమంలో ఇంటి యజమాని మారుతీకుమార్ అద్దెకు ఉంటున్న వారికి చెప్పకుండా దుకాణం బోర్డులు తొలగించి, అందులో ఉన్న స్టాక్‌ను మాయం చేశాడు. అంతేకాకుండా దుకాణంలో ఉన్న నగదు కూడా తీసుకున్నాడు. దీనిపై ఇంటి యజమానిని అడిగితే చంపేస్తానని బెదిరించడంతో స్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సతీశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

రుషికొండ బీచ్‌లో వ్యర్థాలు తొలగింపు



ఎక్స్‌కవేటర్‌తో దుస్తులను తొలగిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలు వాడి పారేసిన దుస్తులన్నీ గెడ్డల ద్వారా సముద్రంలో కలిసి రుషికొండ బీచ్‌కే చేరుతున్నాయి. ఇటు ఫిషింగ్ హార్బర్ నుంచి అటు భీమిలి వరకు అనేక బీచ్‌లు ఉన్నా ఏ తీరానికి కూడా పాత దుస్తులు కొట్టుకురావడం లేదు. కేవలం రుషికొండ తీరానికి మాత్రమే రోజూ టన్నుల కొద్దీ వస్తున్నాయి. ఉదయం పూట ఒడ్డు వరకు సముద్రపు కెరటాలు వస్తున్నాయి. అప్పుడు ఎలాంటి ఇబ్బంది ఉండడం లేదు.మధ్యాహ్నం రెండు గంటలు దాటిన తరువాత సముద్రం పోటు తగ్గి నీరంతా లోపలికి వెళ్లిపోతోంది. అప్పుడు ఈ దుస్తులన్నీ ఇసుకలో కూరుకుపోయి ఉండిపోతున్నాయి. ఇక్కడ ఎక్కడైతే బోటు షికారుకు అనువైన ప్రాంతంగా ఎంపిక చేసి పర్యాటకుల కోసం బోట్లు నడుపుతున్నారో అక్కడికే ఈ దుస్తులన్నీ కొట్టుకువస్తున్నాయి. గత వారం రోజులుగా ఇదే జరుగుతోంది. రోజూ జీవీఎంసీ సిబ్బంది సుమారు టన్నుల వరకు వీటిని తొలగించి లారీల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. గురువారం పాత దుస్తులు పెద్ద ఎత్తున తీరమంతా పరుచుకుని ఉండడంతో సిబ్బందితో సాధ్యం కాదని ఎక్స్‌కవేటర్‌ను తెప్పించి తొలగించారు. సుమారు నాలుగు టన్నుల దుస్తులను తొలగించినట్టు బీచ్ నిర్వాహకులు తెలిపారు.



కూలిన ఇనుప మెట్లు (ఇన్‌సెట్లో) గాయపడిన అటెండర్

జిల్లా ఖజానా కార్యాలయంలో కూలిన ఇనుప మెట్లు

విశాఖపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఖజానా కార్యాలయంలో ఇనుప మెట్లు కూలిపోయాయి. భవనంలో కింది అంతస్తు నుంచి మొదటి అంతస్తుకు వెళ్లడానికి మెట్ల మార్గం వినియోగిస్తారు. గురువారం మధ్యాహ్నం అటెండరు ప్రసాద్ పై అంతస్తుకి వెళుతుండగా ఒక్కసారిగా మెట్ల మార్గం కుప్పకూలిపోయింది. దీంతో ఆయన తలకు దెబ్బతగలడంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా ఖజానా కార్యాలయం భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పాటు మెట్లు మార్గం కూడా బాగా పాడైంది. మెట్ల మార్గం మూసివేయకుండా విడిచిపెట్టడంతో ఈ సంఘటన జరిగిందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రసాదాల నాణ్యతలో రాజీపడొద్దు : ఈఓ

సింహాచలం, మే 29 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామి ప్రసాదాల తయారీ నాణ్యతలో రాజీపడొద్దని ఈఓ వేంద్ర త్రినాథరావు ఆదేశించారు. గురువారం ఆయన ప్రసాదాల విక్రయ కేంద్రాన్ని పరిశీలించారు. రోజువారీ విక్రయాలు, తయారీ సంఖ్య, ఓపెనింగ్, క్లోజింగ్ స్టాక్‌ల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతపై స్వయంగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు పర్యవేక్షణాధికారి ప్రసాద్, డీఈఈ రామరాజు (హరి) ఉన్నారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, మే 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలను బయటకు తీసి భక్తులతో తాకించిన తరువాత బేడా మండపంలో ప్రదక్షిణ జరిపారు. ఉభయ దాతల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శత నామావళి పఠిస్తూ అన్ని నామాలకు స్వర్ణ పుష్పాలతో పూజలు చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్యకల్యాణం నిర్వహించారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, మే 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని చినముషిడివాడ ప్రాంతానికి చెందిన ఎస్. నరసింగరావు, వరలక్ష్మీ దంపతులు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,00,116లను ప్రజా సంబంధాల విభాగం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు గురువారం వారు నగదు రూపంలో అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి, శేషవస్త్రంతో సత్కరించి, ప్రసాదాలను అందజేశారు

1న పైడితల్లమ్మ పండగ నిర్వహణపై గ్రామ సభ

సింహాచలం, మే 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి సోదరి, అడివివరం తదితర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పైడితల్లెమ్మ వార్షిక పండుగ నిర్వాహణ విషయమై చర్చించేందుకు జూన్ 1న గ్రామసభ ఏర్పాటు చేయనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ సభ వరాహ పుష్కరిణికి వెళ్లే మార్గంలోని దేవస్థానానికి చెందిన నృసింహ సదన్‌లో ఆ రోజు ఉదయం 11.00 గంటలకు జరుగుతుంద న్నారు.

తుది దశలో నిలిచిన గ్రంథాలయ భవన నిర్మాణ పనులు

ప్రజాప్రతినిధులు, అధికారులు
స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్న ప్రజలు


నిర్మాణ పనులు నిలిచిపోయిన నాతయ్యపాలెం గ్రంథాలయ భవనం

అక్కిరెడ్డిపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు, ప్రజలకు విజ్ఞానాన్ని అందించే ప్రభుత్వ గ్రంథాలయ భవన నిర్మాణ పనులు తుది దశలో నిలిచిపోవడం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. సుమారు నలభై ఏళ్ల క్రితం నాతయ్యపాలెం పంచాయతీగా ఉన్న సమయంలో స్థానికులకు విజ్ఞానాన్ని అందించాలన్న ఉద్దేశంతో అప్పటి గ్రంథాలయ శాఖ పంచాయతీ కార్యాలయంలోనే లైబ్రరీని ఏర్పాటు చేసింది. దీనికి గ్రంథాలయాధికారిని కూడా నియమించడంతో పాటు వార్తా పత్రికలు, ఇతర పుస్తకాలు, యువతకు ఉపయోగపడే అన్ని రకాల కాంపిటేటివ్ పుస్తకాలను అందుబాటులో ఉంచడంతో నిత్యం ఈ గ్రంథాలయం పాఠకులతో కళకళలాడేది. కాలక్రమేణ ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో 2023లో దీనిని తొలగించి, ఇందులో ఉన్న పుస్తకాలు, ఫర్నీచర్, తదితర సామగ్రిని స్థానిక కళామందిరం గదిలో భద్రపరచడంతో పాటు లైబ్రేరియన్‌ను వేరే గ్రంథాలయానికి బదిలీ చేశారు. అనంతరం రూ.32 లక్షల వ్యయంతో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి 2023 నవంబరులో అప్పటి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. సంబంధిత కాంట్రాక్టరు తనకు కేటాయించిన రూ.32 లక్షలకు తగ్గట్టుగా భవన నిర్మాణాన్ని చేపట్టారు. ఈ భవన నిర్మాణ పనులు 90 శాతం వరకు పూర్తవ్వగా.. ఇంకా తలుపులు, గచ్చులు, చిన్న చిన్న ప్లాస్టింగ్ పనులు, విద్యుత్ పరికరాలను అమర్చడం వంటివి చేయాల్సి ఉంది. నిధుల కొరతతోనే ఈ పనులు నిలిచిపోయినట్టు తెలిసింది. కొత్త గ్రంథాలయం ప్రారంభానికి నోచుకోకపోవడంతో కళామందిరంలో భద్రపరిచిన పుస్తకాలు, ఫర్నీచర్ పాడైపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. 68, 69 వార్డులకు సంబంధించి తుది దశలో ఉన్న ఈ గ్రంథాలయ భవన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు చొరవ చూపాలని వారు కోరుతున్నారు.

త్వరితంగా పునఃప్రారంభించాలి



-గవర వెంకటరమణ,
గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు

ప్రస్తుతం ఎంతోమంది స్థానిక విద్యార్థులు వివిధ ఉద్యోగ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ఇలాంటి సమయంలో వారికి ఉపయుక్తంగా ఉండవలసిన ఈ గ్రంథాదాలయం మూతపడి ఉండడం బాధాకరం. అందువల్ల అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రంథాలయ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి యువతకు అందుబాటులోకి తీసుకురావాలి.

ఉత్సాహంగా ఆటల పోటీలు


ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

పెదగంట్యాడ, మే 29(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు వివిధ క్రీడల్లో పోటీలు జరిగాయి. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయ నిర్వాహణా కమిటీ ఈ పోటీలు నిర్వహించింది. విద్యార్థులు కబడ్డీ, ఖోఖో ఆటలు ఆడారు. పెదగంట్యాడ పరిధిలో పలు పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు వేసవి విజ్ఞాన శిబిరం ముగింపురోజున బహుమతులు ఇస్తామని గ్రంథాలయ నిర్వాహణాధికారి పీవీ రమణ తెలిపారు.

వైభవంగా బంగారమ్మ పండుగ


ప్రత్యేక అలంకరణలో బంగారమ్మ

అక్కిరెడ్డిపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి) : నాతయ్యపాలెం, షీలానగర్ పరిసర కాలనీల ఆరాధ్యదేవత బంగారమ్మ అనుపోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి ఊరేగింపు ఘనంగా జరిగింది. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంపూర్ణంగా గాయత్రీదేవి వార్షికోత్సవ పూజలు


వేదమాత గాయత్రీదేవి

వేపగుంట, మే 29 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట జంక్షన్‌లో ఉన్న శ్రీ వేదమాత గాయత్రిదేవి తృతీయ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. పూజల్లో భాగంగా గాయత్రిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాలుగు వేల మందికి అన్న సమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నాశైలజ, బ్రహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **భైరవం** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కరాటే కిడ్** : శారద
- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం)
- **ఫైనల్ డెస్టినేషన్** : రమాదేవి,
- **సింగిల్** : మెలోడి, కామేశ్వరి, గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 16, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 18, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 32, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 15, క్యారెట్ 38 దొండకాయలు 20, బంగాళ దుంపలు 18, అరటికాయ(పె)9, మునక్కాడలు(కిలో)50, అల్లం (పాతది)54, బరబాటి 28, ముల్లంగి 30, నిమ్మకాయలు(కిలో)80, బద్దచిక్కుడు 40, దోస కాయలు 14, వెల్లులి(పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 28, కాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, , పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన(కట్ట)4, చుక్కకూర (కట్ట)4, పాల కూర(కట్ట)4 ,తోటకూర (కట్ట)4, బూడిదగుమ్మడికాయ20, 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు(కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

'మరో చరిత్ర'తో తెలుగు ప్రజలు నన్ను హీరోగా ఆదరించారు

- ప్రముఖ నటుడు కమల్‌హాసన్
- ఇప్పటికీ చాలా మంది నాది విశాఖపట్నం సొంతూరు అనుకుంటారు
- ఘనంగా 'థగ్ లైఫ్' ప్రీ రిలీజ్ వేడుక
- 'జగన్నాథ రథచక్రాలు వస్తున్నాయ్' అంటూ శ్రీశ్రీ కవితతో అలరించిన కమల్


వేదికపై కమల్‌హాసన్, శింభూ, త్రిష, నాజర్, అభిరామి తదితరులు

సిరిపురం, మే 29 (ఆంధ్రజ్యోతి) : 'మరో చరిత్ర చిత్రం షూటింగ్ కోసం తొలిసారిగా విశాఖపట్నం వచ్చాను. ప్రశాంతమైన వాతావరణంలోని అప్పుడు ఎవరూ నన్ను గుర్తుపట్టలేదు. షూటింగ్ అంతా ఎంతో సౌకర్యంగా జరిగింది. 'మరో చరిత్ర' చిత్రం ద్వారా తెలుగు ప్రజలు నన్ను ఎంతో ఆదరించారు' అని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ పేర్కొన్నారు. గురువారం రాత్రి సిరిపురం గురజాడ కళాక్షేత్రంలోని 'థగ్‌లైఫ్' చిత్రం ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో పాల్గొన్న కమల్‌హాసన్ మాట్లాడుతూ.. విశాఖపట్నం అంటే తనకు హోమ్‌సిటీ లాంటిదన్నారు. ఇప్పటికీ చాలా మంది తన మిత్రులు చతనకు ఫోన్ చేసి 'ఏమీ... మీ సొంతూరు వెళ్లలేదా..?' అంటుంటారని అన్నారు. వాళ్ల దృష్టిలో సొంతూరు అంటే విశాఖపట్నమని అన్నారు. ఎన్నో గొప్ప చిత్రాల్లో తాను నటించానని, ఆయా చిత్రాలు గొప్పగా రావడానికి దర్శకులే కారణమన్నారు. అయితే కొన్ని చిత్రాలు ఫెయిల్ అయ్యాయని, అందుకు మాత్రం తానే కారణమన్నారు. విశాఖపట్నంలోని జొన్నవలసలో 'శుభసంకల్పం' చిత్రం షూటింగ్ చేశామని, ఇప్పటికీ నాకు అవన్నీ గుర్తు ఉన్నాయన్నారు. 'సాగరసాగమం'తో పాటు మరికొన్ని చిత్రాలు కూడా ఇక్కడే షూటింగ్ చేశామన్నారు. మణిరత్నంతో చేసిన నాయకుడు గొప్ప విజయం సాధించిందని, అలాగే 'థగ్‌లైఫ్' చిత్రం చాలా బాగా వచ్చిందన్నారు .ఇందులోని నా పాత్రకు సమానంగా విలన్‌గా పాత్ర ఉంటుందన్నారు. 'థగ్‌లైఫ్' జూన్ 5 విడుదల కానుందని, మంచి విజయాన్ని సాధిస్తుందన్న నమ్మకంగా ఉందన్నారు. శింబు, త్రిషతో కలిసి నటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. నాకు ఎప్పటి నుంచో తెలిసిన స్నేహితుడు నాజర్‌తో మరోసారి నటించడం గొప్ప అనుభూతిని ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ రాసిన 'పతితులార..భ్రష్టులార..బాధాసర్పదష్టులార... ఏడవకండి.. ఏడవకండి.. జగన్నాథ రథచక్రాలు వస్తున్నాయ్.. వస్తున్నాయ్.. భూకంపం పుట్టిస్తా...' అంటూ కమలహాసన్ చెప్పడంతో ఒక్కసారిగా ఆడిటోరియం దద్దరిల్లింది. హీరో శింబు మాట్లాడుతూ కమల్ సార్‌తో పని చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఇక్కడ బీచ్ తనకు ఎంతో ఇష్టమన్నారు. ఆయన స్వయంగా పాడిన 'బుజ్జిపిల్లా...' పాటను ఆలపించి అలరించారు. త్వరలో 'ఓజీ' చిత్రంలో కూడా తాను పాడబోతున్నానన్నారు. హీరోయిన్ త్రిష మాట్లాడుతూ కమల్‌హాసన్‌తో పని చేయడం గొప్పగా భావిస్తున్నానన్నారు. వర్షం సమయంలోని ఇక్కడకొచ్చానని మీ ప్రేమకు ధన్యవాదాలు తెలిపారు. మరో హీరోయిన్ అభిరామి మాట్లాడుతూ 'చెప్పవే చిరుగాలి..' చిత్రం విశాఖలోనే షూటింగ్ చేశామని, మళ్లీ ఇన్ని రోజులకు ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్టు నాజర్ మాట్లాడుతూ 'థగ్‌లైఫ్' చిత్రం చాలా బాగుంటుందన్నారు. కార్యక్రమంలో నిర్మాత సుధాకర్, తదితరులుపాల్గొన్నారు.

బస్సు సదుపాయం కల్పించరూ!

కూర్మన్నపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87 వార్డు కణితి కాళింగ వీధి రామాలయం నుంచి వడ్లపూడి మీదుగా కాంప్లెక్స్‌కు వెళ్లడానికి ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పించాలని తిరుమల నగర్ కాలనీ అసోసియేషన్ కోరారు. స్టీల్‌సిటీ ఆర్టీసీ డిపో మేనేజర్ గౌతమ్ ఛటర్జీ, అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ శ్రీనివాసరావుకు గురువారం వినతి పత్రం అందజేసారు. దీనిలో భాగంగా 87వ వార్డులో సుమారు 25 వేల జనాభా ఉన్నారనీ, సరైన బస్సు సౌకర్యం లేక వివిధ పనుల మీద బయటకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారని వినతిలో పేర్కొన్నారు. గతంలో ఈ కాలనీలు మీదుగా బస్సు సౌకర్యం ఉండేదని, ప్రస్తుతం లేక పోవడంతో అవస్థలు పడుతున్నామని అన్నారు. దువ్వాడ రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, పూర్ణా మార్కెట్‌కు వెళ్లే బస్సులను వడ్లపూడి, కణితి మీదుగా రాకపోకలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన అధికారులు ఆర్ఎం దృష్టికి సమస్యను తీసుకు వెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాలనీ సభ్యులు పాల్గొన్నారు.


ట్రాఫిక్ మేనేజర్ శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేస్తున్న తిరుమల నగర్ కాలనీ వాసులు

ఫిషింగ్ జెట్టీ నిర్మించాలి

మత్స్యకారుల డిమాండ్

పెదగంట్యాడ, మే 29(ఆంధ్రజ్యోతి): గంగవరం పోర్టుకు యారాడ బీచ్‌కు మధ్య సాగరతీరంలో ఫిషింగ్ జెట్టీని నిర్మించాలని మత్స్యకారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు గురువారం విజయవాడలో జరిగిన రాష్ట్రమత్స్యకారుల అసోసియేషన్ రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా మత్స్యకార నిర్వాసిత కమిటీ నాయకుడు గంటిపిల్లి అమ్మోరు మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణ దశలోనే ఫిషింగ్ జెట్టీని నిర్మిస్తామని, మత్స్యకారుల వృత్తికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు పట్టించుకోలేదని పేర్కొన్నారు. గంగవరం పోర్టు బెర్తుల సంఖ్య పెరిగితే మత్స్యకారుల్లో ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పిన ప్రజా ప్రతినిధులు ఇప్పటికీ ప్రయత్నాలే చేయలేదని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ వాడకంపై అవగాహన

గోపాలపట్నం, మే 29(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 8వ జోన్ అధికారులు ప్రధాన రహదారి పక్కనే ఉన్న దుకాణాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్న దుకాణాలదారుల నుంచి వాటిని స్వాధీనం చేసుకుని జరిమాన విధించారు. పర్యావరణానికి ముప్పు కలిగించే ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తప్పవని దుకాణదారులకు హెచ్చరించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా నారతో చేసిన సంచులను వినియోగించాలని సూచించారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వేపగుంట, మే 29(ఆంధ్రజ్యోతి): సతివానిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ ఫీడర్‌పై నిర్వాహణ, చెట్ల కొమ్మలు తొలగింపు పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్ 3 ఈఈ, పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా సత్తివానిపాలెం, అహ్మద్‌నగర్, కోటనరవ కాలనీ, ఎమ్.ఈ.ఎస్ లేఔట్ ప్రాంతాల ప్రజలు గమనించాలని తెలియజేశారు.

మహిళలకు అహల్యబాయి హోల్కర్ ఆదర్శం

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేనంకొండ కృష్ణంరాజు

ఆటోనగర్,మే 29 (ఆంధ్రజ్యోతి): మహిళలకు రాణి అహల్యబాయ్ హోల్కర్ ఆదర్శమని, ఆమె ఆశయ సాధనకు నేటి తరం మహిళలు కృషి చేయాలని జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు దేనంకొండ కృష్ణంరాజు అన్నారు. జీవీఎంసీ 70 వార్డు ఎల్వీ నగర్‌లో గురువారం బీజేపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి కట్టా పద్మ ఆధ్వర్యంలో నిర్వహించిన అహల్యాబాయి హోల్కర్ 300 జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మ రక్షణ కోసం అహల్యాబాయి ఎన్నో దేవవాలయాలను నిర్మించారని అన్నారు. భారతదేశంలో సుమారు 240 దేవాలయాలను అభివృద్ధి చేశారని చెప్పారు. 17వ శతాబ్ధంలో 30 ఏళ్ల పాటు మరాఠా సామ్రాజ్యాన్ని అహల్యాబాయి పాలించారని ఆయన అన్నారు. మండల అధ్యక్షురాలు పావని అహల్యబాయ్ వీరత్వాన్ని కొనియాడారు. ఆమె ఆశయాలకు అనుగుణంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ ధర్మం కోసం సుపరిపాలన అందిస్తున్నారనీ అన్నారు. ఈ కార్యక్రమంలో సంతోశ్, రమేశ్, బుచ్చిరాజు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షణలో చురుగ్గా ఉద్యోగులు

కూర్మన్నపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం 87 వార్డు వడ్లపూడి ఆర్యవైశ్య సామాజిక మండపంలోని జీవీఎంసీ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జోనల్ కమిషనర్ శేషాద్రి మాట్లాడుతూ యోగా భారతదేశ వారసత్వ సంపదని, ప్రపంచ వ్యాప్తంగా అందరూ యోగా చేస్తూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటున్నారని అన్నారు. ఏఎంఓహెచ్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ నేటి యాంత్రిక జీవనంలో ప్రతి ఒక్కరు యోగా చేసి మానసిక ప్రశాంతతను, ఒత్తిడి లేని జీవితాన్ని పొందాలని అన్నారు. యోగా గురువు పర్యవేక్షణలో పలువురు యోగాసనాలు వేసి వాటి వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కారుమూరి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.


డీఏవీ స్కూల్‌లో యోగా శిక్షణ ఇస్తున్న దృశ్యం.

వేపగుంట


మహిళా సమాఖ్య కేంద్రంలో యోగా శిక్షణ

బుచ్చిరాజుపాలెం డీఏవీ స్కూల్‌లో జీవీఎంసీ ఈయూసీడీ ఆధ్వర్యంలో వార్డుల వలంటీర్లకు యోగా శిక్షణ శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మిడిరమణ మాట్లాడుతూ యోగా ద్వారా మానసిక, శారీరక ప్రశాంతత కలుగుతుందన్నారు. వైజాగ్‌లో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ చిరంజీవి, ఆర్.పి.లు, స్థానిక నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెందుర్తి

ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సచివాలయ ఉద్యోగులకు యోగా శిక్షణ ఇస్తున్నారు. ఈ క్రమంలో గురువారం పెందుర్తిలోని టీటీడీసీలో గ్రామాల వారిగ ఎంపిక చేసిన సిబ్బందికి యోగా శిక్షణ తరగతుల ఏర్పాటు చేశారు. ఇందులో శిక్షణ పూర్తి చేసుకున్న వారు గ్రామాల్లో యోగా శిక్షణ ఇస్తారు. ఎంపీడీవో గుండాల అప్పలరాజు యోగా శిక్షణ శిబిరాన్ని సందర్శించి యోగాడేను విజయవంతం చేయాలన్నారు.

మల్కాపురం

జూన్ 21న అంతర్జాతీయ దినోత్సవం యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న 32 సచివాలయాల సిబ్బందితో శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రి ప్రాంగణంలో యోగా శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ శిబిరాన్ని జీవీఎంసీ జోన్ 5 కమిషనర్ రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడురోజులు పాటు ఈ శిక్షణ కొనసాగుతుందని అన్నారు. యోగాలో అనుభవజ్ఞులతో శిక్షణ ఇప్పిస్తున్నామని అన్నారు. ప్రతి ఉద్యోగి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులకు కొబ్బరి నూనె డబ్బాలు, సబ్బులు అందజేస్తున్న దృశ్యం

పారిశుధ్య కార్మికులు మరింత కష్టపడాలి

85వ వార్డు కార్పొరేటర్ వరలక్ష్మి

అగనంపూడి, మే 29 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు పారిశుధ్య కార్మికులు మరింత కృషి చేయాలని 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి పేర్కొన్నారు. పెదమడకలోని గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వార్డులోని పారిశుధ్య కార్మికులకు కొబ్బరి నూనె, సబ్బులు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో కార్మికుల సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దోశేంద్ర, శానటరీ ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య, కూటమి నేతలు పాల్గొన్నారు.

షిరిడి సాయికి ప్రత్యేక పూజలు

అగనంపూడి, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక షిర్డీసాయి బాబా ఆలయంలో విశాఖ షిర్డీసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

కార్మికులపై కేసులు పెట్టడం సరికాదు

అఖిలపక్ష కార్మిక సంఘం నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, మే 29 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో పోరాటాలు చేస్తున్న కాంట్రాక్టు కార్మికులపై యాజమాన్యం కేసులు పెట్టడం సరికాదని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. టౌన్‌షిప్‌లో గురువారం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ గతంలో లేని సంస్కృతికి యాజమాన్యం తెరలేపుతోందని, ఇది సరికాదని అన్నారు. కార్మిక నాయకులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అగనంపూడి, మే 28 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, ఇన్‌డోర్ ఎస్ఎస్ లైన్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అగనంపూడి సెక్షన్ ఏఈ లక్ష్మణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీల, పాతఅగనంపూడి, శ్రీనివాసనగర్, శాంతినగర్, అన్నపూర్ణానగర్, గల్లవాని పాలెం, శనివాడ, జాబిలిహిల్స్, దువ్వాడ, లక్కరాజుపాలెం, యాతపాలెం, శివాజీనగర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

ప్రతి నీటిబొట్టును కాపాడుకోవాలి

సీహెచ్ఆర్వో అరుణ్ లెస్లీ జార్జి


పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు చిత్రించిన చిత్రాలు

మల్కాపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిక్షణతో పాటు ప్రతి నీటిబొట్టును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కోరమాండల్ ఎరువుల కర్మాగారం అంతర్జాతీయ అధ్యక్షుడు సీహెచ్ఆర్వో అరుణ్ లెస్లీ జార్జి పేర్కొన్నారు. శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'పర్యావరణ పరిరక్షణ, నీటి వనరుల కాపాడుకోవడం' అనే అంశంపై విద్యార్థులకు గురువారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అలాగే నీటి స్వచ్ఛత కీలక పాత్రను సూచించే తామర, లిల్లీ మొక్కలతో అలంకరించిన, వాటర్ గార్డెన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నీటిపై అవగాహన కలిగించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. తమ కంపెని ఇటువంటి కార్యక్రమాలు ప్రోత్సహిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ కంపెనీ సభ్యులు పాల్గొన్నారు.

'సిమెంట్ ధరలపై ప్రభుత్వం దృష్టి సారించాలి'

వేపగుంట, మే 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భవన నిర్మాణ రంగం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిలదొక్కుకుంటుందన్న తరుణంలో సిమెంట్ ధరలు దాదాపు రూ. 150 పెరగడంతో బిల్డర్లు ఆందోళ చెందుతున్నారు. దీంతో నిర్మాణాలు నిలిపేసే పరిస్థితి ఏర్పడిందని జోన్ 8 బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.వి.రామరాజు పేర్కొన్నారు. సిమెంట్ ధరలు పెరుగుదలపై జోన్ 8 బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం సింహపురికాలనీ కార్యలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వాళ్ల ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. గతంలో ఇసుక ధరలతో ఇబ్బందులు ఎదుర్కొంటే, ఇప్పుడు సిమెంట్ కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి ఒకేసారి సిమెంట్ ధరను 150 నుంచి 375కు చేరడంతో పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణ కార్మికులను, బిల్డర్లను ఆదుకోవాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ జీఎంకు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సత్కారం

ఉక్కుటౌన్‌షిప్, మే 29 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ జీఎం (హెచ్ఆర్) జి.గాంధీతో ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ గురువారం ప్లాంట్‌లో సమావేశమైంది. ఉద్యోగుల సంక్షేమానికి, వారి సమస్యలు పరిష్కరించేందుకు గాంధీ చేసిన కృషి ప్రశంసనీయమని కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యవర్గం జీఎంను సత్కరించింది. స్టీల్‌ప్లాంట్ మరింత ప్రగతికి ప్రతి కార్మికుడు కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.






సభలో అమ్మాయిల ఉత్సాహం


మహానాడు వేదిక


సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు





మహా జాతర



కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం





సినిమా థియేటర్లలో ముగిసిన తనిఖీలు

» 57 సినిమా హాళ్లు, ఏడు మల్టీప్లెక్స్‌ల్లో సోదాలు » నేడు జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేసే అవకాశం

విశాఖపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని సినిమా థియేటర్లు, మల్టీప్లెక్స్‌ల్లో రెవెన్యూ, పోలీస్, జీవీఎంసీ అధికారులు సంయుక్తంగా బుధవారం తనిఖీలు ప్రారంభించిన విషయం తెలిసిందే. తొలి రోజైన బుధవారం 50 థియేటర్లు, ఏడు మల్టీ ప్లెక్స్‌ల్లో తనిఖీలు చేయగా, గురువారం మిగిలిన థియేటర్లలో తనిఖీలను పూర్తి చేశారు. ఆర్డీలోలు శ్రీలేఖ, సంగీత్‌మాధుర్ ఆధ్వర్యంలో 11 మంది తహశీల్దార్లు, స్థానిక సీఐలు, జీవీఎంసీ, అగ్నిమాపకశాఖ అధికారులు ఆయా థియేటర్లు, మల్టీప్లెక్స్‌లకు వెళ్లి అక్కడి పరిస్థితులు, సౌకర్యాలను పరిశీలించారు. కాగా అన్నిచోట్లా పాప్‌కార్న్, పిజ్జా, బర్గర్, మిషన్ కూల్ డ్రింక్స్, ఫ్రెంచ్‌ఫ్రై, స్వీట్‌కార్న్, సమోసా, పఫ్ వంటి తినుబండరాల ధరలను అధిక రేట్లకు విక్రయిస్తున్నట్టు అధికారులు తమ తనిఖీల్లో గుర్తించినట్టు తెలిసింది. అలాగే మరుగుదొడ్ల నిర్వహణ, థియేటర్లలో సీట్ల నిర్వహణ అధ్వానంగా ఉన్నట్టు వారి పరిశీలనలో తేలినట్టు సమాచారం. ప్రతీచోటా పార్కింగ్ కోసం ఫీజులు వసూలు చేస్తున్నారని, బయటనుంచి ఆహార పదార్థాలను లోపలకు అనుమతించకుండా, క్యాంటీన్‌లోనే కొనుగోలు చేయాలని నిర్బంధిస్తున్నారని అధికారులు గుర్తించినట్టు తెలియవచ్చింది. తనిఖీలకు సంబంధించిన నివేదికలను ఆర్డీవోల ద్వారా జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు శుక్రవారం అందజేసే అవకాశం ఉంది.

అప్పన్నను దర్శించుకున్న పంచాయతీరాజ్ కమిషనర్

సింహాచలం, మే 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యదర్శి మైలవరపు కృష్ణతేజ గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఈఓ వేంద్ర త్రినాథరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న అధికారి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను, ప్రసాదాలను అందజేశారు.


కప్పస్తంభం వద్ద ఐఏఎస్ అధికారి కృష్ణతేజ్ దంపతులు

7 నుంచి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

విశాఖపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీలోని జీవీఎంసీ స్పోర్ట్స్ ఎరీనాలో జూన్ 7 నుంచి 10వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నమెంటును నిర్వహిస్తున్నట్టు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పల్లా శ్రీనివాసరావు తెలిపారు. 'యాన్యువల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ అండ్ సెలక్షన్ ట్రయల్స్ 2025'లో భాగంగా విశాఖ జిల్లా అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. అండర్-11, 13, 15, 17 కేటగిరిల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు వచ్చే నెల మూడో తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 0440367158, 9885075455 ఫోన్ నంబర్లను సంప్రతించాలని కోరారు.

భార్య కనిపించడం లేదని ఫిర్యాదు

పెదగంట్యాడ, మే 29 (ఆంధ్రజ్యోతి): నాలుగా రోజులుగా తన భార్య సుజాత (33) కనిపించడం లేదంటూ పెదగంట్యాడలోని నీలావు వీధికి చెందిన దాతుల విజయ్ అనే వ్యక్తి గురువారం న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాజువాకలోని ఒక షెడ్డులో తాను మెకానిక్‌గా పనిచేస్తున్నానని, తనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 25న తనకు, భార్యకు మధ్య చిన్న గొడవ జరిగిందని, ఆ తరువాత నుంచి ఆమె కనిపించడం లేదన్నారు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వాకబు చేసిన ఎటువంటి ఫలితం లేకుండి పోయిందని పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





కోళ్ల వ్యర్థాల సేకరణ టెండర్లపై కలెక్టర్ ఆరా

» వివరాలు ఇవ్వాలని జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం

» అధికారులకు ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో కోళ్ల వ్యర్థాల సేకరణకు సంబంధించిన వ్యవహారం వివాదాస్పదం కావడంతో సంబంధిత అధికారులపై జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సీరియస్ అయినట్టు తెలిసింది. దుకాణాల నుంచి కోడి వ్యర్థాలు సేకరించి కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించేందుకు జీవీఎంసీ ఆరు నెలల కిందట టెండర్లు పిలిచి, జోన్‌ల వారీగా కాంట్రాక్టర్లను ఖరారు చేసింది. ఈ విషయమై కూటమి నాయకుల మధ్య విభేదాలు తలెత్తాయి. కొందరు నేతలు తమ అనుచరులు, బినామీల ద్వారా అనధికారికంగా చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాలు సేకరిస్తున్నారు. అలా అనధికారి కంగా కోడి వ్యర్థాలు సేకరిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని ఒక పార్టీ నేత ఆదేశిస్తే, మరో పార్టీ నేత విడిచిపెట్టాలని కోరుతున్నారు. దీంతో నగరంలో చికెన్ వ్యర్థాల టెండర్లను పూర్తిగా రద్దు చేయాలని ఒక ప్రజాప్రతినిధి నేరుగా జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 27న కథనం ప్రచురితమవ్వడంతో కోడి వ్యర్థాల సేకరణకు సంబంధించిన టెండర్లు,ఏవిధంగా కేటాయించారనే వివరాలతో కూడిన ఫైల్‌ను పట్టుకుని రావాలని జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులను కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు ప్రజారోగ్య విభాగం అధికారులు బుధవారం కలెక్టర్‌ను కలిసి టెండర్‌ల సమాచారాన్ని కలెక్టర్‌కు బుధవారం వివరించినట్టు తెలిసింది. దీనిపై పూర్తిగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటానని కలెక్టర్ స్పష్టంచేసినట్టు తెలిసింది.

9న రాష్ట్రవ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టుల ఆందోళన

» రెండు కీలక చట్టాల రద్దుపై నిరసన

» ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటరావు, ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు

వెంకోజీపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టులకు సంబంధించిన రెండు కీలక చట్టాలను కేంద్రం రద్దు చేయడాన్ని నిరసిస్తూ జూన్ 9న రాష్ట్ర వ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టులు ఆందోళన నిర్వహించనున్నట్టు ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటరావు, ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు ప్రకటించారు. గురువారం ఏయూ ప్లాటినం జూబ్లీ హాలులో ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రం తాజాగా 44 కార్మిక చట్టాలను రద్దు చేసిందని, ఇందులో రెండు జర్నలిస్టులకు సంబంధించినవి ఉన్నాయన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల చట్టం 1955, వేతనాల చెల్లింపుల చట్టం 1958 రద్దు చేసిన వాటిలో ఉన్నాయని, వీటిని తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జూన్ 9న నిర్వహించే జాతీయ కార్మిక సంఘాల ఆందోళనలో జర్నలిస్టులు కూడా పాల్గొనవలసిందిగా పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే దశలవారీగా ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా నేటికీ కొత్త అక్రిడేషన్లను మంజూరు చేయలేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా జర్నలిస్టులు ఇళ్ల స్థలాలకు సైతం నోచుకోవడం లేదన్నారు. సమావేశంలో చేసిన తీర్మానాలను త్వరలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌లకు నివేదిస్తామన్నారు. సమావేశంలో వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ బ్రాడ్ కాస్ట్‌కు సంబంధించిన నూతన వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, నాయకులు ఎం.కొండయ్య, కె.మంజరి, పి.నారాయణ, జి.శ్రీనివాసరావు, ఇరోతి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వర్కింగ్ జర్నలిస్టుల వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు అదనపు కోచ్

విశాఖపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని భువనేశ్వర్, బెంగళూర్ మధ్య రాకపోకలు సాగించే 18463, 18464 నెంబర్లు గల ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈనెల 29 నుంచి జూన్ 1వ తేదీ వరకు అదనంగా ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను జత చేశామని సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు.

కేకే లైన్‌లో కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు

» పట్టాలు తప్పిన బోగీలను తొలగించే ప్రక్రియ వేగవంతం

అరకులోయ/అనంతగిరి, మే 29(ఆంధ్రజ్యోతి): కొత్తవలస-కిరండూల్ (కేకే) లైన్‌లో అనంతగిరి మండలం తైడ-చిమిడిపల్లి స్టేషన్ల మధ్య బుధవారం గూడ్స్ రైలు పట్టాలు తప్పిన సంఘటనలో పునరుద్ధరణ పనులు గురువారం కూడా కొనసాగాయి. సుమారు 33 గూడ్స్ బోగీలు పట్టాలు తప్పడం, వీటిలో మూడు బోగీలు టన్నెల్‌లో పట్టాలు తప్పడంతో వాటిని తొలగించడం కష్టంగా ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. డీఆర్‌ఎం, ఏడీఆర్‌ఎం, ఇతర రైల్వే అధికారుల పర్యవేక్షణలో పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం నాటికి పనులు పూర్తి కావచ్చని భావిస్తున్నారు. కాగా గురువారం కూడా పాసింజర్ రైలు, నైట్ ఎక్స్‌ప్రెస్ రైలు రద్దయ్యాయి. రోజూ కిరండూల్ నుంచి విశాఖపట్నానికి గూడ్స్ రైళ్ల ద్వారా ఐరన్ ఓర్ తరలించే ప్రక్రియ నిలిచిపోయింది. పాసింజరు రైలు రద్దు కావడంతో పర్యాటకుల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో అరకులోయ, బొర్రా ప్రాంతంలో పర్యాటకుల సందడి తగ్గింది.



CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, VUPPALA SYAMALA ANNAPURNA (Old Name), W/o. Vuppala Sriram, R/o. H.No.10-7-34, Vuppala vari veedhi, Anakapalli, A.P. Change my name from VUPPALA SYAMALA ANNAPURNA (Old Name) to VUPPALA SHYAMALA ANNAPURNA (New Name). Henceforth I will be called as VUPPALA SHYAMALA ANNAPURNA (New Name), W/o. Vuppala Sriram, for all purposes.
AJV_242249

WANTED

★ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్స్‌ని, పిల్లలను చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు కావలెను. ఏజెంట్స్ కూడా కావలెను. జీతం: 15k, ఏజెంట్ కమిషన్ : 5k. ఫోన్: 8977517749 AJH-6753

For Advertisement Contact :
9963231176
9966165093

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి